



జగనన్న.. భూ భక్ష



భూ సమస్యలు.. భూ వివాదాల పరిష్కారం కోసమంటూ గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్ష పథకం సరికొత్త సమస్యలు తీసుకొచ్చింది. భూ రక్ష మాటేమో కానీ పలువురి భూములను మాయం చేసి భూ భక్ష పథకంగా మారింది. సర్వే అనంతరం గతంలో కంటే అత్యధికంగా భూ సమస్యలు, వివాదాలు నెలకొన్నాయంటే ఈ పథకం ఎంత లోప భూయిష్టంగా జరిగిందో తెలుస్తోంది. ఈ పథకం లోపాల పుట్టగా మారిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్ట్' గా పేరు మార్చింది. అయితే సర్వే అనంతరం నెలకొన్న సమస్యల గురించి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని.. అసలు పథకాన్ని, సర్వేను రద్దు చేయాలని భూ బాధితులు డిమాండ్ చేస్తున్నారు. వంశపారంపర్యంగా వచ్చిన రైతుల భూ హక్కులను హరించిన అప్పటి సర్వేనే రద్దు చేయాలని రైతులు, రైతు సంఘాల డిమాండ్ చేస్తున్నాయి.



ఎందరో మనోవేదన

పాత కాలం వదిలేస్తే, బ్రిటిష్ కాలంలో 1906 నుంచి 1927 వరకు రీ సర్వే జరిపారు. దీనిలో జరిగిన లోటుపాట్లను సవరించడానికి మరో పదేళ్లు దీనిని పొడిగించారు. ఆ తర్వాత కూడా సర్వేలు జరుగుతూనే వచ్చాయి. అయితే ఇంతటి తక్కువ కాలంలో చేయగలిగే అవకాశం ఇప్పుడున్నా, సాంకేతికతను పక్కనపెట్టి, కాగిత ఆధారాలు పట్టించుకోకుండా రెండేళ్లలో చేసిన సర్వే రైతుల హక్కును భక్షించేసింది. విదేశాల్లో ఉన్నవారికైతే నేటికీ వారి భూముల పరిస్థితి ఏమిటనేది తెలియని పరిస్థితి. ఒకవేళ రికార్డులు తారుమారయ్యాయని తెలిసినా, అక్కడి నుంచి వచ్చి తిరగలేని పరిస్థితుల్లో మనోవేదనకు గురవుతున్న వారూ ఉన్నారు.

వైసీపీ నేతల మాటలతోనే..

భూముల రీ సర్వేలో దస్తావేజులు, పాస్ పుస్తకాలతో పని లేదు. వెబ్‌లాండ్ రిజిస్టర్, అడంగల్, ఈసీ వంటివి కూడా అవసరంలేదు. వీటన్నింటికీ మించి గత ప్రభుత్వంలోని వైసీపీ నేతల నోటి మాటకే అధికారులు సర్వేలో ఎక్కువ విలువిచ్చారు. వారు తమ వారికి ఎంత పొలం ఉందంటే అంత రాసేశారు. డ్రోన్ కెమేరా చిత్రాలు, ఓఆర్ఐ మ్యాప్‌కు మ్యాచ్ కాక రిమార్క్ చూపినా వాటిని రిజెక్ట్ కొట్టేసి మరీ వారు అనుకున్న ప్రకారం సర్వే చేశామనిపించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 80 శాతం గ్రామాల్లో ఇదే తీరులో సర్వే జరిగిందనడానికి ప్రస్తుతం భూ వివాదాలకు సంబంధించి కోర్టులో ఈ రెండేళ్లలో పెరుగుతూ వచ్చిన కేసుల సంఖ్యే సాక్ష్యం.



గుంటూరులో ఓ వ్యక్తికి దస్తావేజులు, పాస్ పుస్తకాల ప్రకారం 1.30 ఎకరాల భూమి ఉంది. కానీ రీ సర్వే చేసి ఆయన పేరుపై 1.42 ఎకరాలు నమోదు చేశారు. మిగిలిన 12 సెంట్లు పక్కరైతు భూమి. ఇప్పుడు ఆ రైతు తనకు తెలియకుండా తన భూమిని మరొకరికి ఎలా రాసేస్తారంటూ అధికారులపై కేసు వేశారు.

పథకం రద్దుతోనే రక్షణంటున్న రైతులు

- పథకం పేరు మార్చితే సరిపోదంటున్న బాధితులు
- రీ సర్వేతో ఉన్న సమస్యలు తోడైన సరికొత్త సమస్యలు
- రికార్డులను పరిశీలించకుండానే ఇష్టానుసారంగా సర్వే
- ఊరిలో లేకుంటే వారి భూములు మరొకరికి ధారాదత్తం
- సర్వే జరిగిన గ్రామాల్లో 90 శాతం కొత్త భూ సమస్యలే
- కార్యాలయాలు, కోర్టుల చుట్టూత బాధితుల ప్రదక్షిణలు


తెనాలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత జగన్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీ సర్వే చేపడతామని, దశాబ్దాలుగా ఉన్న భూ వివాదాలను పరిష్కరిస్తామని.. దేశంలోనే ఇదొక గొప్ప పథకం అంటూ 2022 నవంబరులో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్ష ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా అధికారులు రీ సర్వే చేపట్టారు. అయితే రీ సర్వేతో భూ సమస్యలు తీరిపోతాయని, సరిహద్దుల గొడవలన్నీ పరిష్కారం అవుతాయని అప్పట్లో అందరూ భావించారు. అయితే వారి ఆలోచనలను తలకిందులు చేస్తూ ఉన్న సమస్యల పరిష్కారం కాదుకదా.. వాటి స్థానంలో కొత్త సమస్యలు పుట్టుకొచ్చాయి. అమ్మినవారికి, కొన్నవారికి, జాయింట్ ఖాతాలున్న వారికి మధ్య, కుటుంబాల్లోని అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మధ్య కూడా ఈ సర్వేతో చిచ్చురేగింది. ఒకరిపై ఒకరు కోర్టులో కేసులు వేసుకునే వరకు రీ సర్వే చిచ్చు రేపింది. ఇన్ని సమస్యలు కేవలం రీ సర్వే సృష్టించినవే అయితే, వాటిని క్షేత్ర స్థాయిలో అప్పటికప్పుడు పరిష్కరించాలంటూ అప్పటి ప్రభుత్వం స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్‌లను నియమించింది. వారేం చేస్తున్నారనేది కూడా అంతుబట్టని విషయమే.

అర్హత లేకున్నా రీ సర్వే కోసంగా ఉద్యోగోన్నతులు..

రీ సర్వేలో సమస్యలను రికార్డుల ఆధారంగా పరిశీలించి అప్పటికప్పుడు పరిష్కరించేందుకు అప్పటి ప్రభుత్వం కొందరు డిప్యూటీ తహసీల్దార్‌లను స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్లుగా నియమించింది. అయితే డీటీగా ఉన్నవారిని ఈ పోస్టులకు పంపితే పర్వాలేదు. కానీ సీనియర్ అసిస్టెంట్లకు ఏ అర్హతా లేకుండానే వారికి ఉద్యోగోన్నతులు ఇచ్చేసి నియమించింది. సాధారణంగా సీనియర్ అసిస్టెంట్ డిప్యూటీ తహసీల్దార్ కావాలంటే డిపార్ట్‌మెంట్ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలి. కానీ అవేమీ లేకుండానే వారికి డీటీలుగా ఉద్యోగోన్నతి ఇచ్చేశారు. స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్ హోదాలో రీ సర్వే కారణంగా వచ్చిన వివాదాలను పరిష్కరించిన దాఖలాలు ఏవైనా ఉన్నాయంటే వేళ్లపై లెక్కపెట్టడానికి కూడా దొరకవు. తహసీల్దార్‌లు, సబ్‌కలెక్టర్, కలెక్టర్ కార్యాలయాలనే బాధితులు ఆశ్రయించారు. చాలావరకు కోర్టులకు వెళ్లినవారూ ఉన్నారు. ప్రభుత్వం వివాదాల పరిష్కారం కోసమని ప్రత్యేక ప్రమోషన్‌లు ఇస్తే, వాటిని వారు పరిష్కరించకపోవడంతో కోర్టుల్లో కేసులు పెరిగి సమయం, కేసుల భారం ఎక్కువైపోయింది. అయితే ఈ ప్రత్యేక ఉత్తర్వులను అడ్డుపెట్టుకుని డీటీలుగానే అర్హత లేనివారు ఇప్పుడు ఏకంగా తహసీల్దార్ హోదాలో చలాయించేస్తున్నారు.

గత సర్వే రద్దు చేయాల్సిందేనా..

గత వైసీపీ ప్రభుత్వ కాలంలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం రీ సర్వేను రద్దు చేయాలనేది రైతులు, రైతు సంఘాల వాదన. సర్వే విషయంలో కనీస జాగ్రత్తలు, రికార్డుల పరిశీలన జరగలేదని, కేవలం అప్పటి నేతల సిఫార్సులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే జరిగిపోయిందనేది వారి వాదన. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్ష పథకం లోపాల పుట్టగా మారిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తాజాగా పేరును మార్చింది. ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్ట్‌గా పేరు మార్చుతూ ఈ నెల 17న ముఖ్య కార్యదర్శి పేరుతో జీవో విడుదల చేశారు. అయితే కేవలం పేరు మార్చితే సరిపోదని గత రీ సర్వేను రద్దు చేసి, తిరిగి వాస్తవ పరిస్థితుల ఆధారంగా జరపాలనేది రైతుల విన్నపం.



రీ సర్వే సమస్యల్లో కొన్ని ఉదాహరణలు..

- తెనాలి మండలం పినపాడులో ఓ వ్యక్తికి 4.3 ఎకరాల పొలం వంశపారంపర్యంగా వచ్చింది. రీ సర్వే నాటికి ఆయన చనిపోవడం, ఆయన నలుగురు సంతానంలో ఒక్కరు మాత్రమే స్వగ్రామంలో ఉన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ముగ్గురి పేరుపై ఒక్క సెంటు కూడాలేకుండా, మొత్తం విస్తీర్ణాన్ని స్థానికంగా ఉన్న వ్యక్తికే రాసేశారు. దీంతో మిగిలిన ముగ్గురు సోదరులు తమ భూ హక్కు కోసం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. భూమి మొత్తం సొంతం చేసుకున్న వారి సోదరుడు తన బంధువుతో ఆ భూమికి సంబంధించి వివాదం ఉన్నట్లు కోర్టులో కేసు వేశారు. దీంతో రెవెన్యూ అధికారులు కూడా కోర్టులో కేసు ఉందనే కారణంతో దానిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా వదిలేశారు.
- రేపల్లెలో ఓ వ్యక్తి తనకున్న 1.80 ఎకరాల పొలంలో ఒక ఎకరం అమ్మేసి, తన పేరుపై మిగిలిన 80 సెంట్లు అట్టిపెట్టుకున్నారు. అయితే రీ సర్వేలో అమ్మిన భూమిని కూడా అతడికే సొంతమని నమోదు చేశారు. కొనుగోలు చేసిన వ్యక్తి రిజిస్ట్రేషన్ పత్రాలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే, అమ్మిన వ్యక్తి మాత్రం తాను తన పొలం ఎవరికీ అమ్మలేదని, అసలు రిజిస్ట్రేషనే చేయలేదని, తన భూమిని అన్యాక్రాంతం చేసేందుకు అధికారులతో కలసి కుట్రలు చేస్తున్నారంటూ అతడిపై కోర్టులో ఎదురు దావా వేయడం విశేషం.
- తెనాలి మండలం కొలవరంలో 308 సర్వే నంబరు నుంచి భూమిని ఓ వ్యక్తి నుంచి ప్రభుత్వం దశాబ్దాల క్రితం కొనుగోలుచేసి పేదలకు పట్టాలిచ్చింది. అదే నంబరులో మరో 1.5 ఎకరాల భూమిని వారు ప్రభుత్వానికి అమ్మలేదు. 20 ఏళ్లుగా వారికిందే ఉన్న ఆ భూమికి సంబంధించి దస్తావేజులు, పాస్ పుస్తకాలు, అడంగల్ అన్నీ వారే ఆ భూమికి హక్కుదారులని చూపిస్తున్నది. అయితే వాటిని పట్టించుకోకుండా రీ సర్వే సిబ్బంది ఆ భూమిని కూడా ప్రభుత్వ భూమి కింద నమోదు చేశారు. ఇప్పుడు ఆ భూమిపై తనకు హక్కుందని తప్పును సరిదిద్ది, తన భూమిని తనకు అప్పగించాలని ఓ మహిళ ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ఆశ్రయించారు.
- తెనాలిలో 2.5 ఎకరాల భూమికి హక్కుదారు అంటూ రీ సర్వేలో ఆసిఫ్‌ఉన్నీసా అనే మహిళ పేరుపై నమోదు చేశారు. ఇక్కడ విశేషమేమంటే అసలు ఆ పేరున్న మహిళే అక్కడ లేరు. ఏ రికార్డులూ పరిశీలించకుండా, ఏ ఆధారాలు లేకుండా కొత్త పేరు ఎలా నమోదు చేశారనేది సర్వే సిబ్బంది నిర్లక్ష్యాన్ని, రీ సర్వే జరిపిన తీరును వేలెత్తి చూపిస్తుంది. ఆ భూమి అసలు హక్కుదారు తన భూమిని తన పేరుపై మార్చాలని ఆధారాలతో రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూ లబోదిబోమంటున్నారు. ఇప్పుడు అసలు రైతు పేరుపై మార్చి రాయాలంటే, మొదట నమోదు చేసిన రైతుకు నోటీసులిచ్చి, ఆ భూమిపై తనకున్న హక్కును నిరూపించుకోలేని పక్షంలోనే పేరు మార్పు చెయ్యాలి. కానీ అసలు లేని రైతును ఎక్కడి నుంచి తీసుకురావాలో అధికారులకు అంతుపట్టని సమస్య.



నేటితో ముగియనున్న బదిలీల గడువు

- రేపటి నుంచి అమల్లోకి రానున్న నిషేధం
- బదిలీల ఉత్తర్వులు విడుదల్లో ఇంకా జాప్యం

గుంటూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీలపై సడలించిన నిషేధం ఆదివారంతో పూర్తి కానుంది. సోమవారం నుంచి ఉద్యోగుల బదిలీలపై తిరిగి నిషేధం అమలులోకి రానుంది. అయితే ఇప్పటివరకు వివిధ శాఖల్లో పూర్తి చేసిన బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను ఆయా శాఖాధిపతులు విడుదల చేయలేదు. ఆదివారం సాయంత్రం/అర్ధరాత్రి దాటాక విడుదల చేసే అవకాశం ఉన్నట్లుగా ఉద్యోగ సంఘాల నేతల ద్వారా తెలిసింది. జిల్లా స్థాయి అధికారుల బదిలీలు నిర్వహించే ఆయా రాష్ట్ర శాఖలు కూడా ఇంకా బదిలీ చేసిన వారి జాబితాలను ప్రభుత్వ పోర్టల్‌లో పెట్టలేదు. ఏటా మేలోనే ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు జరుగుతుంటాయి. అయితే ఈ సంవత్సరం ఎన్నికలు రావడంతో బదిలీల ప్రక్రియ వాయిదా వేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికల కోసం ఇతర జిల్లాలకు వెళ్లిన అధికారులు తిరిగి మాతృ జిల్లాలకు రావడం కూడా కొంత ఆలస్యమైంది. అంతా సర్దుకుని బదిలీలు చేపట్టే సమయంలో ప్రకృతి విపత్తులు సంభవించాయి. దీంతో బదిలీల ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ప్రభుత్వం ఈ నెల 23 నుంచి తిరిగి నిషేధాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు స్పష్టం చేసింది. దాంతో దాదాపుగా అన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియని పూర్తి చేసినా అధికారులు గోప్యంగా ఉంచారు. రెవెన్యూ శాఖలో తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐ, ఎస్ఏ, జేఏ, వీఆర్వో, వీఆర్ఏల బదిలీలు ఇంకా విడుదల చేయలేదు. పంచాయతీరాజ్‌లోనూ ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీల బదిలీలు జరగలేదు. ఇక రాష్ట్ర స్థాయిలో జరిగే జిల్లా వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యాన, మార్కెటింగ్, డీఆర్‌డీఏ, డ్వామా, స్త్రీ, శిశు సంక్షేమం, హౌసింగ్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల్లో వివిధ హోదాల్లో ఇంజనీర్లు, డీడీ, ఏడీ స్థాయి అధికారుల బదిలీలు ఆదివారం రాత్రి విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. మున్సిపల్, పరిశ్రమలు శాఖ మాత్రమే కొంతమంది అధికారుల బదిలీలకు సంబంధించినవి అప్‌లోడింగ్ చేశాయి. ఆ ప్రకారం చూస్తే..

పరిశ్రమల శాఖలో: ప్రస్తుతం కడప జిల్లా జేడీగా ఉన్న ఏ జయలక్ష్మిని గుంటూరు డీఐసీ జేడీ/డీఐవోగా ప్రభుత్వం పోస్టింగ్ చేసింది. ఏపీఐడీసీలో డీడీగా డిప్యూటేషన్‌పై ఉన్న జేఎన్ఎస్ గోపాలనాయుడుని బాపట్ల డీఐసీ డీడీ/డీఐవోగా నియమించింది.

మున్సిపల్ శాఖలో: గుంటూరు నగరపాలకసంస్థలో సూపరింటెండెంట్ బీ వేణుబాబుని మాచర్ల మున్సిపల్ కమిషనర్‌గా పోస్టింగ్ చేసింది. గుంటూరు అదనపు కమిషనర్‌గా ఓబులేసుని నియమించింది. ఎం జస్వంత్ రావుని నరసరావుపేట మున్సిపాలిటీ కమిషనర్‌గా నియమించి అక్కడ ఉన్న సీ రవిచంద్రారెడ్డిని మాతృశాఖకు రిలీవింగ్ చేసింది. గురజాల కమిషనర్ కే చిన్నయ్యని సూళ్లూరుపేటకు బదిలీ చేసింది.



గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్‌లో కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గ్రీన్ గ్రేస్ నిర్మాణ పనులు నిలిపివేయాలి

- ప్లాన్ కాపీలో షార్ట్ ఫాల్స్ ఉన్నాయి
- జులైలోనే పనుల నిలుపుదలకు నోటీసులు జారీ
- జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

6లో..



ఇసుకకు ఆన్‌లైన్ అగచాట్లు

- ఏపీ శాండ్ పోర్టల్‌కు సాంకేతిక సమస్యలు
- దానిని క్లిక్ చేస్తే నో-రెస్పాన్స్ అంటూ ఎర్రర్ మెసేజ్
- ఎప్పటికి సరి చేస్తారో.. వినియోగదారులకు ఎప్పుడు అందుతుందో?

గుంటూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇసుకను సులభంగా.. పారదర్శకంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు అడ్డంకులు ఏర్పడుతూనే ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామి మేరకు ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న స్టాక్‌యార్డుల్లో నిల్వ చేసిన ఇసుకని కేవలం లోడింగ్ చార్జీలు చెల్లించి తీసుకెళ్లే వెసులుబాటుని వినియోగదారులకు కల్పించింది. సీఎం చంద్రబాబునాయుడు గనుల శాఖ ఈ పోర్టల్‌ని అధికారికంగా ప్రారంభించారు. మైనింగ్ పోర్టల్ ఏపీ శాండ్ సేల్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పేరుతో వెబ్ లింకుని అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే దాని మీద నొక్కితే ఎర్రర్ పేజ్ ఓపెన్ అవుతుందే తప్ప యూజర్ రిజిస్ట్రేషన్‌కు మార్గం చూపించడం లేదు. రెండు రోజుల నుంచి వినియోగదారులు ఈ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్‌కి ప్రయత్నిస్తున్నా సాధ్యపడటం లేదు. స్థానిక అధికారులను ఈ విషయంపై ప్రశ్నిస్తే రాష్ట్ర స్థాయిలోనే సాంకేతిక సమస్య ఉందని చెబుతున్నారు.

రవాణా చార్జీలపై ప్రతిష్టంభన

ఉచిత ఇసుకకు సంబంధించి రవాణా చార్జీలు అధికంగా వసూలు చేస్తున్నారని ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు జిల్లా వ్యాప్తంగా ఇసుక లారీల యజమానులతో ఇటీవల అధికారులు సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. అంతిమంగా ప్రభుత్వం చార్జీలు ఎంత వసూలు చేసుకోవాలో కూడా నిర్ణయించింది. ఆ ప్రకారం 0-10 కిలోమీటర్లు ట్రాక్టర్‌కు రూ.547, ఆరు టైర్ల లారీకి రూ.972, 10 టైర్ల లారీకి రూ.1,532గా రవాణా చార్జీలు వసూలు చేసుకోవచ్చు. 11-20 కిలోమీటర్లు అయితే వరుసగా రూ.1094, రూ.1,945, రూ.3,063, 21-30 కిలోమీటర్లు అయితే రూ.1641, రూ.2917, రూ.4,595, 31-40 కిలోమీటర్లు అయితే రూ.2188, రూ.3,890, రూ.6,128, 41-50 కిలోమీటర్లు అయితే రూ.2456, రూ.4485, రూ.7198, 51-60 కిలోమీటర్లు అయితే రూ.2724, రూ.5081, రూ.8270, 61-70 కిలోమీటర్ల అయితే రూ.2992, రూ.5676, రూ.9342, 71-80 కిలోమీటర్లు అయితే రూ.3260, రూ.6272, రూ.10414, 81-90 కిలోమీటర్ల దూరం అయితే రూ.3528, రూ.6868, రూ.11487గా నిర్ణయించింది. అయితే ఈ ధరలకు కొద్దిమంది లారీ ఓనర్లు మాత్రమే ముందుకొచ్చారు. ఇలా శ్లాబులుగా కాకుండా కిలోమీటర్‌కు రూ.200 చొప్పున రవాణా చార్జీగా నిర్ణయిస్తేనే తమకు గిట్టుబాటు అవుతుందని చెప్పారు. దీంతో రవాణా చార్జీలపై ప్రతిష్టంభన ఏర్పడింది. మరోవైపు 11వ తేదీ నుంచే ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ అమలులోకి రావాల్సి ఉండగా నేటి వరకు పత్తా లేదు. దీంతో ఇసుక కోసం వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

విజ్ఞప్తులు పరిశీలించి.. పరిష్కరిస్తా

● 34వ రోజు ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్ హామీ

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 21: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ శనివారం 34వ రోజు తాడేపల్లిలోని ఉండవల్లి సీఎం నివాసం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి మంగళగిరి నియోజకవర్గంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విన్నవించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కొన్ని సమస్యలపై అప్పటికప్పుడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

మంగళగిరి నియోజకవర్గం నుంచి..

మంగళగిరి మండలం నూతక్కికి చెందిన విజ్ఞాన విహార పాఠశాల ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. రేవేంద్రపాడు వద్ద బకింగ్ హామ్ కెనాల్‌పై శిథిలావస్థలో ఉన్న పురాతన వంతెనను పునర్నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. రేవేంద్రపాడు వంతెనపై వేలాది మంది ప్రజలు, రైతులు, పాఠశాలల, కళాశాలల విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని శిథిలావస్థలో ఉన్న వంతెనపై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి స్పందిస్తూ వంతెన పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా నియోజకవర్గ వ్యాప్తం అండర్ గ్రౌండ్ డ్రెయినేజి పనులను త్వరలోనే మొదలు పెడతామని హామీ ఇచ్చారు. ఆత్మకూరు గ్రామంలో తాతా సాంబశివరావు ఇంటి వద్ద నుంచి ఆర్సీఎం చర్చి వరకు ఉన్న మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా నిర్మించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా సమితి, గ్రామస్తులు విన్నవించారు. ఇంజినీరింగ్ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని చినకాకానికి చెందిన వి.కౌశిక్, వి.కోమలి మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో ఎన్నిమార్లు దరఖాస్తు చేసినా వితంతు పెన్షన్ మంజూరు చేయలేదనీ, పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన ఎం.శివనాగమణి విజ్ఞప్తి చేశారు. పరిటాలలోని ఎంవీఆర్ ఇంజినీరింగ్ కాలేజిలో ఎంబీయే చదివిన



ముస్లిం సోదరీమణుల సమస్యలు వింటూ..

తనకు గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించని కారణంగా సర్టిఫికెట్లు కాలేజిలో నిలిచిపోయాయని తన సర్టిఫికెట్లు ఇచ్చేలే చర్యలు తీసుకోవాలని తాడేపల్లికి చెందిన జి.ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.



దివ్యాంగురాలి బాబును పలకరిస్తున్న లోకేశ్

రాష్ట్ర వ్యాప్తంగా విజ్ఞప్తులు

విజయవాడ విద్యాధరపురంలో నివాసం ఉండే తాము ఇటీవల సంభవించిన వరదలకు ఇంట్లోకి నీరు చేరడంతో బంధువుల ఇంటిలో తలదాచుకున్నామని, నష్టపరిహారం అంచనా కోసం అధికారులు వచ్చిన సమయంలో ఇంటిలో లేమని, తమ కుటుంబానికి కూడా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని షేక్ మలికాబేగం విజ్ఞప్తి చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటిలో క్యాజువల్ లేబర్‌లుగా 8 నెలల నుంచి పని చేస్తున్న తమను అర్ధాంతరంగా విధుల నుంచి తొలగించాలని కార్మికులు మంత్రికి ఫిర్యాదు చేశారు. ఇసుక సరఫరాలో లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కాకినాడకు చెందిన శ్రీలక్ష్మి శ్రీనివాస క్యారీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. లారీ కిరాయిపై జీఎస్టీ రద్దుతోపాటు సెక్యూరిటి డిపాజిట్టును రద్దు చేయాలని కోరారు. ఇసుక సరఫరా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా చేసేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గుంటూరు జిల్లా డీఎంహెచ్‌వో పరిధిలో వివిధ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో పని చేస్తున్న డీఈవోలు, ఎల్జీఎస్‌లకు 2023 నవంబర్ నుంచి నిలిచిపోయిన జీతం బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు. అనారోగ్యంతో బాధ పడుతున్న తన భార్యకు సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్యసాయం అందించి ఆదుకోవాలని విశాఖ జిల్లా యలమంచిలి నియోజకవర్గం అప్పారాయుడుపాలెంకు చెందిన కణితి మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు. వైసీపీకి చెందిన కొంతమంది వ్యక్తులు తమ మల్బరీ షెడ్‌ను తగులబెట్టడంతో భారీగా నష్టపోయామని విచారించి తగిన న్యాయం చేయాలని కర్నూలు జిల్లా కొత్తపల్లికి చెందిన వల్లిగి సుధాకర్ విజ్ఞప్తి చేశారు. అన్ని విజ్ఞప్తులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేశ్ ప్రజలకు హామీ ఇచ్చారు.

ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణకు ఘన స్వాగతం

● తెనాలిలో భారీ ర్యాలీ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 21 : ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగకు తెనాలిలో శనివారం ఘన స్వాగతం లభించింది. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు సానుకూలంగా ప్రకటించడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తెనాలిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి విచ్చేసిన కృష్ణమాదిగకు మాదిగ సామాజికవర్గం భారీ ఎత్తున స్వాగతం పలికింది. వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల నుంచి మార్కెట్ యార్డు వరకు ర్యాలీగా తీసుకు వచ్చారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ర్యాలీలో భారీ ఎత్తున పాల్గొనడంతో సభా స్థలికి చేరుకోవడానికి మూడు గంటలు పైగా సమయం పట్టింది. గుంటూరు- తెనాలి మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. రాత్రి 10.30కు సభాస్థలికి చేరుకున్న ఆయనకు పలు గ్రామాల నుంచి వచ్చిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బోకేలతో సత్కరించారు. ఐఆర్ఎస్ అధికారి పులిపాక ఆనందరావు ఆధ్వర్యంలో సమ్మేళనానికి ఏర్పాట్లు చేశారు. జిల్లా, రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ

గ్రీన్ గ్రేస్ నిర్మాణ పనులు నిలిపివేయాలి

● ప్లాన్ కాపీలో షార్ట్ ఫాల్స్ ఉన్నాయి
● జూలైలోనే పనుల నిలుపుదలకు నోటీసులు జారీ
● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 21: గుంటూరు నగరం పట్టాభిపురం మెయిన్ రోడ్డులో జరుగుతున్న గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. వివిధ మీడియా సంస్థల కథనాలు, ఫిర్యాదులపై నగరంలోని గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణ పనులను పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి శనివారం పరిశీలించామని చెప్పారు. వారు పొందిన అనుమతి, జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా తనిఖీ చేశామని వివరించారు. జీఎంసీ అధికారులు ఇచ్చిన షార్ట్ ఫాల్స్ పూర్తి చేసే వరకూ నిర్మాణ పనులను పూర్తిగా నిలిపివేయాలని ఈ ఏడాది జూలైలోనే ఇచ్చిన నోటీసు మేరకు నిర్మాణదారులు పనులు నిలిపివేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు.

కొలతలతో తనిఖీ..

అపార్టుమెంట్ నిర్మాణానికి తీసుకున్న అనుమతులు, జరుగుతున్న నిర్మాణ పనులను తొలుత కమిషనర్ మ్యాప్ ద్వారా పరిశీలించారు. మీడియా కథనాల్లో వచ్చిన అంశాలపై అధికారులు, బిల్డర్లను అడిగి తెలుసుకొని స్వయంగా కొలతలు ద్వారా తనిఖీ చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ గ్రీన్ గ్రేస్ నిర్మాణం 2015లో ప్రారంభమైందనీ, తర్వాత మేనేజ్‌మెంట్ మారడం, నిర్దేశిత డాక్యుమెంట్లు జత చేయకపోవడంపై జీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు షార్ట్ ఫాల్స్ నోటీసులు ఇచ్చారన్నారు. 2024 జూలైలో షార్ట్ ఫాల్స్ క్లియర్ చేసే వరకు నిర్మాణ పనులు నిలిపి వేయాలని ఫైనల్ నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. మీడియాలో కథనాలు వచ్చిన వెంటనే పట్టణ ప్రణాళికాధికారులను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. నగరపాలక సంస్థ నుంచి భవన నిర్మాణానికి తీసుకున్న అనుమతులు, జరుగుతున్న నిర్మాణ పనులను అధికారుల నివేదిక ఆధారంగా క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. పట్టణ ప్రణాళిక అధికారుల నివేదిక, తమ తనిఖీలో గమనించిన అంశాల ఆధారంగా చట్టపరంగా ఏమైనా అతిక్రమణలు జరిగాయా అని పరిశీలిస్తామన్నారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, డిప్యూటీ సిటీ ప్లానర్ మహా పాత్రో, ఏసీపీ మురళి, టీపీఎస్ రిజ్వాన, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ ప్లాన్ కాపీని పరిశీలిస్తున్న జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

టీటీడీ లడ్డూ వివాదంపై సీబీఐ విచారణ కోరాలి

గుంటూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ తయారీలో గత పాలక మండలి జంతువుల కొవ్వు, చేపనూనె వంటివి వినియోగించినట్లుగా వచ్చిన ల్యాబ్ రిపోర్టులపై సీబీఐ విచారణను రాష్ట్ర ప్రభుత్వం కోరాలని ధార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాధ్యులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని కోరారు. దేవుడు సొమ్మును అప్పనంగా దోచుకున్న టీటీడీ బోర్డు సభ్యులు, ప్రభుత్వాధినేతలను కఠినంగా శిక్షించి రాజకీయ నాయకులు, ప్రభుత్వాలకు కనువిప్పు కలిగించాలన్నారు. తిరుమల లడ్డూని అపవిత్రం చేశారని వచ్చిన ఆరోపణలపై కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామి వారి భక్తుల మనోభావాలు దెబ్బతిన్న కారణంగా హిందూ ధార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, వెంకటేశ్వర స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం గుంటూరు నగరంలోని శంకర్‌విలాస్ సెంటర్‌లో శాంతియుత నిరసన కార్యక్రమం జరిగింది. నాలుగు అడుగుల వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా వేద పండితులతో వెంకటేశ్వర స్వామి వారికి అష్టోత్తర శతనామావళి పూజాదికాలు, హారతి నైవేద్య, కైంకర్యాలు నిర్వహించారు. నిరసన ప్రదర్శనకు సిరిపురపు శ్రీధర్ శర్మ, వనమా నరేంద్ర, జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి, దాసరి రాము, వావిలాల కుమార్ తదితరులు నేతృత్వం వహించారు. దేశంలో ఉన్న దేవాలయాలపై రాజకీయ నాయకుల జోక్యం లేకుండా, వారి కబంధ హస్తాల్లో నుంచి దేవాలయాలను బయటకు తెచ్చే విధంగా కేంద్రంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టి చట్టం తీసుకురావాలని కోరారు. ఏపీ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన ఎల్వీ సుబ్రహ్మణ్యం ఇచ్చిన జీవో ఆధారంగా దేవాలయాల్లో అన్యమత ఉద్యోగస్తుల్ని తొలగించి వేరే ప్రభుత్వ సంస్థల్లోకి తరలించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండపల్లి శబరి, పెద్దింటి చైతన్య కృష్ణ, చిలుమూరు ఫణి, షేక్ బాజీ, వడ్లమాను ప్రసాద్, కూరపాటి కిషోర్, ఐలూరి శ్రీనివాసు, వేదాంతం హరినాథ్, సంజీవ్, వడ్లమూడి రాజా, కొప్పర్తి సీతారమేష్, ఫమ్మిడిగంటం రమణయ్య, వెలగలేటి గంగాధర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, నారాయణరెడ్డి, నల్లపునేని అమర్నాథ్, ఎన్జీవో అసోసియేషన్ మూర్తి, గుండు జ్ఞానేశ్వర్, పట్టాభిరాముడు, రాజ్ కుమార్, ఆంజనేయులు, అన్నా లక్ష్మి, లీల, చెరక కుమార్ గౌడ్, తుమ్మెద కొమ్మిన నరేష్, రాజేష్, మునిపల్లి తేజ, బాలు, వంశీ, గుత్తికొండ శ్రీనివాస్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌విలాస్ సెంటర్‌లో జరిగిన ఆధ్యాత్మిక నిరసన ప్రదర్శనలో ధార్మిక సంఘాల నాయకులు

రోడ్డుపై బైఠాయించి నిరసన

గుంటూరు, సెప్టెంబరు 21: టీటీడీ పవిత్రను మంట గలిపిన ఆ ముగ్గురుపై సీబీఐతో విచారణ జరిపించాలని హిందూ ధార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం గుంటూరు నగరంలోని శంకర్ విలాస్ సెంటర్‌లో జిల్లాలో ఉన్న అన్ని హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. నాటి దేవస్థానం ఈవో ధర్మారెడ్డి, చైర్మన్ సుబ్బారెడ్డి, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై సీబీఐతో విచారణ జరపాలని ఆయా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. హిందూ దేవాలయాల ధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు దర్శనపు శ్రీనివాస్ మాట్లాడుతూ క్రైస్తవుడైన జగన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో రాష్ట్రంలోని అన్ని హిందూ దేవాలయాలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. కాంచిభట్ల హర్షవర్ధన్, శివశక్తి ఉత్తరాంధ్ర సమన్వయకర్త పి.లక్ష్మీ రామానుజ దాసి, యువమోర్చా నాయకులు యశ్వంత్, జనసేన నాయకులు కొండూరి కిషోర్, విద్యార్థి సంఘ, హిందూ సంఘం నేతలు పాల్గొన్నారు.

మాచర్ల మున్సిపల్ కమిషనర్‌గా వేణుబాబు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 21 : మాచర్ల మున్సిపల్ కమిషనర్‌గా ధూళిపాళ్ల వేణుబాబును నియమించారు. ప్రస్తుతం ఆయన గుంటూరు కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారు.


జీఎంసీ అదనపు కమిషనర్‌గా ఓబులేశు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 21 : నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా సి.ఓబులేశును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో నంబరు 723ను విడుదల చేసింది. ప్రస్తుతం అదనపు కమిషనర్‌గా ఉన్న రాజ్యలక్ష్మిని బదిలీ చేస్తూ ఆమె స్థానంలో ఓబులేశ్‌ను నియమించారు.

యువకుడు దుర్మరణం

మేడికొండూరు సెప్టెంబరు 21: ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ కింద పడి యువకుడు దుర్మరణం పాలైన సంఘటన మండలంలోని పేరేచర్ల ఫ్లైఓవర్ పక్కన సర్వీసు రోడ్డులో శనివారం జరిగింది. ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామానికి చెందిన మండలనేని లక్ష్మీ నాగ సురేంద్ర (20) తన గ్రామం నుంచి మోటార్ సైకిల్‌పై గుంటూరు వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొంది. దీంతో సురేంద్ర ట్యాంకర్ కిందకు పడిపోగా ఆయనపై వెనుక టైరు ఎక్కడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న మేడికొండూరు రక్షక్ పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అతివేగం ప్రాణం తీసింది...



శ్రీవల్లి (ఫైల్ ఫొటో)

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అతివేగం ఓ మహిళ ప్రాణం తీయగా..మరో ఇద్దరిని తీవ్ర గాయాలపాలు చేసింది. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...గుంటూరు జిల్లా, బ్రహ్మణ కోడూరుకు చెందిన సొపాటి శ్రీవల్లీ(23) గత కొంత కాలంగా నగరంలోని ఈసీఐఎల్‌లో ఉంటూ స్థానిక యోధ డైగ్నస్టిక్ సెంటర్‌లో రిసెప్షనిస్టుగా పని చేస్తుంది. కాగా గురువారం ఆమెకు సన్నిహితులైనా నేరేడ్‌మెట్‌కు చెందిన కారు డ్రైవర్ శివ(28), దమ్మాయిగూడకు చెందిన అనిల్(25)తో కలిసి కారులో గుంటూరు లోని తన తండ్రి కోటేశ్వరరావు వద్దకు వెళ్లింది. పని ముగించుకుని శుక్రవారం అదే కారులో వారు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు. వీరు ప్రయాణిస్తున్న కారు పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగురోడ్డు మీదుగా ఘట్‌కేసర్ వైపుకు వెళ్తుంది. అతి వేగంతో వెళ్తున్న కారు తారామతిపేట గ్రామ సమీపం వద్దకు రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలి రోడ్డుపై బోల్తా పడింది. కారులో నుంచి శ్రీవల్లీతో పాటు అందులో ఉన్న ఇద్దరు రోడ్డుపై పడ్డారు. శ్రీవల్లీ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. శివ, అనిత్‌కు తీవ్ర గాయాలకు కావడంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ఎస్వీఎన్ కాలనీలో భారీ చోరీ

● 50 సవర్ల బంగారు ఆభరణాలు, రూ. లక్షా 70 వేల నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిలో పరిశీలిస్తున్న పట్టాభిపురం సీఐ వీరేంద్ర, ఎస్సై మధుపవన్

గుంటూరు, సెప్టెంబరు 21: స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్వీఎన్ కాలనీ ఏడో లైన్‌లో పట్టపగలే భారీ చోరీ జరిగింది. తాళం వేసిన ఇంటిని దొంగలు లూటీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.వి.ఎన్. కాలనీ ఏడో లైనుకు చెందిన ఎం.వీ.శంకర్ చిట్‌ఫండ్స్‌తోపాటు ఫైనాన్సు వ్యాపారం చేస్తుంటారు. శనివారం ఉదయం ఆయన బయటికి వెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో భార్య పద్మావతి ఎన్జీవో కాలనీలోని బంధువుల ఇంటికి వెళ్లారు. వారికి మంచానికే పరిమితమైన దివ్యాంగుడైన కుమారుడు ఉన్నారు. మధ్యాహ్నం పద్మావతి బయటకు వెళ్లే సమయంలో కుమారుడికి టాబ్లెట్ వేసి వెళ్లారు. ఆమె తిరిగి నాలుగు గంటలకు ఇంటికి వచ్చేసరికి చోరీ జరిగింది. ఇంటి ముందు సీసీ కెమెరాలతోపాటు చిన్న కుక్క పిల్లల తల్లి కూడా అక్కడే ఉంటుంది. అయితే దొంగలు వెనుక వైపు నుంచి లోనికి ప్రవేశించారు. వెనకవైపు వంటగది తలుపును గట్టిగా నెట్టడంతో బోల్టు ఊడింది. లోనికి ప్రవేశించిన దొంగలు బీరువా తాళాలు డ్రెస్సింగ్ టేబుల్‌లో ఉంచడంతో అవి తీసుకొని బీరువాని తీసి అందులో ఉన్న 50 సవర్ల బంగారు ఆభరణాలు, లక్షా 70 వేల నగదు అపహరించారు. పట్టపగలు భారీ చోరీ జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బాధితుడు శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. సమాచారం అందుకున్న పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు, ఎస్సై మధుపవన్, సీసీఎస్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల ఇల్లు, ప్రదేశాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 21: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం నాటికి 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4,287 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,136 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 44,943 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 46,943 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 21: ప్రాజెక్టులో శనివారం 42.00 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 29,928 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 33,640 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు. దీనిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా, మిగిలినవి ఒక గేటు ద్వారా విడుదల అవుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ప్రజల మనోభావాలను దెబ్బతీసిన వైసీపీ: ఎమ్మెల్యే మాధవి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): తిరుపతి లడ్డూను కల్తీ చేయించి వైసీపీ అధి నేత జగన్‌రెడ్డి ప్రజల మనో భావాలతో ఆట లాడారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు పశ్చిమ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న కూడా ప్రజల మనోభావాలను కాపాడి, వారి సంప్రదాయాలను గౌర వించాలని అన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

దేవుడితో ఆటలాడిన జగన్‌కు శిక్ష తప్పదు: మన్నవ


మాట్లాడుతున్న మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామితో ఆటలాడిన జగన్‌రెడ్డికి శిక్ష తప్పదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంతటి ఘోరానికి పాల్పడిన వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జగన్ తన బంధువులు, సామాజి కవర్గానికి చెందినవారికి, సన్నిహితులకు తిరుమల కొండను అప్పగించారని, వారు అవినీతి, అస్తవ్యస్త నిర్ణయాలతో తిరుమలను సర్వనాశనం చేశారని విమ ర్శించారు. కల్తీ నెయ్యి వచ్చిన నివేదికపై వైసీపీ నేతలు సమాధానం చెబుతారా? అని ఆయన ప్రశ్నించారు.. ఆరోపణలు చేయడం అసత్యాలు, అబద్ధాలతో ఎదుటివారిపై బురద చల్లడం వైసీపీ నైజమన్నారు. దేవుడితో ఆటలాడితే పుట్టగతులు ఉండవనే విషయాన్ని వైసీపీ నాయకులు ఇకనైనా తెలుసుకోవాలన్నారు.

ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిని ఉపేక్షించొద్దు

● జెడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా


మాట్లాడుతున్న హెనీ క్రిస్టినా, డాక్టర్ సురేష్ కుమార్

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 21 : తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిని ఉపేక్షించకూడదని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. శనివారం జడ్పీ ఛైర్ పర్సన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెనీ క్రిస్టినా దంపతులు మాట్లా డారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ మహా పాతకం జరిగిందని అన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైసీపీ నేతల ఆలోచనలు అన్నీ కుట్ర, కుతంత్రాలతోనే ఉంటా యని విమర్శించారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం మంచి ప్రభు త్వం అని ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధిని అందిస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ ప్రజల మన్ననలు పొందుతుందని ఆమె అన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ మరో ఇరవై ఏళ్ళు ఇదే ప్రభుత్వం అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. సమావేశంలో మాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర నాయకుడు ఎస్. నాగరాజు పాల్గొన్నారు.

లడ్డూ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు21: తిరుపతి లడ్డూ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ అంశంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఇటు వంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినచర్యలు తీసుకోవాలని అన్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా సంస్థ దేశంలో పనిచేస్తోందా లేదా అనే అనుమానం కలుగుతోందని అన్నారు. టీడీపీ ప్రభుత్వం మొబైల్ వ్యాన్లను తెప్పించడంతో పాటు ఫుడ్‌సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. జంగాల అజయ్‌కుమార్, కోటా మాల్యాద్రి పాల్గొన్నారు.

హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై చర్యలకు వినతి

గుంటూరు సిటీ, సెప్టెంబరు 21 : తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ ప్రసాదాన్ని జంతు కబేళా నూనె తో కల్తీ చేసి హిందువుల మనో భావాలను దెబ్బతీసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గుంటూరు బీజేపీ ధార్మిక సెల్ కన్వీనర్ ప్రతాప ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం నగరంపాలెం సీఐ మధుసూదన్‌ను కలిసిన బీజేపీ ధార్మిక సెల్ నేతలు ఈ మేరకు వినతిపత్రం అంద జేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, రాష్ట్ర పథాధికారి కొక్కెర శ్రీనివాస్, పార్లమెంటు సంయోజక్ భీమి నేని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐతో విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలి

గుంటూరు, సెప్టెంబరు 21: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపి బాధ్యుతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ డిమాండ్ చేశారు. గుంటూరులో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల పవిత్రతకు, ప్రతిష్ఠకు ఎటువంటి భంగంవాటిల్లకుండా చూడాలని సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

గుంటూరు వైసీపీలో ముసలం

● భారీగా వైసీపీ కార్పొరేటర్ల రాజీనామాలు

● నేడు 'జనసేన'లో చేరేందుకు రంగం సిద్ధం

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 21: గుంటూరు నగరంలో వైఎస్ఆర్ కాం గ్రెస్ పార్టీలో ముసలం మొదలైంది. ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు వరుస పెట్టి రాజీనామాలు చేయడంతో ఒక్కసారిగా నగరంలో రాజకీయ ఉత్కంఠ ఏర్పడింది. ఎ ఆదివారం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో వైసీపీ కార్పొరేటర్లు జనసేనలో చేరనున్నారు. రాజీనామాలు చేసిన వారిలో కార్పొరేటర్లు నిమ్మల వెంకట రమణ, సంకూరి శ్రీనివాసరావు, ఇర్రి ధనలక్ష్మి, అయిశెట్టి కనకదుర్గ, కో-ఆప్షన్ సభ్యు రాలు మహమ్మద్ సాజిద, భాను తదితరులు ఉన్నారు. మరికొందరు కార్పొరేటర్లు ఇదే బాటలో జనసేన తీర్థం పుచ్చుకోనున్నారని సమాచారం. వైసీపీ కార్పొరేటర్ల వరస రాజీనామాలతో ఆ పార్టీ పరిస్థితి మరింత దయనీయంగా ఉన్నట్లు తెలుస్తోంది.

రౌడీ షీటర్ల మధ్య కోల్డ్ వార్

ఓ రౌడీ షీటర్ పై మరో రౌడీషీటర్ హత్యాయత్నం

గుంటూరు, సెప్టెంబరు 21 : పాత కక్షలు, ఆధిపత్య పోరు నేపథ్యంలో ఇరువురు రౌడీషీటర్ల మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. ఈ క్రమంలో ఓ రౌడీ షీటర్‌ను హత్య చేసేందుకు మరో రౌడీషీటర్, మరికొందరితో కలిసి ప్రయత్నించగా ఈ విషయం పసికట్టిన రౌడీషీటర్ పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నాడు. బాధిత రౌడీషీటర్ అచ్చికట్ల జోషి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ కే.శ్రీనివాస్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శివ నాగరాజు కాలనీకి చెందిన రౌడీషీటర్ అచ్చికట్ల జోషి పెయింట్ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మరో రౌడీషీటర్ మద్దిరాల గోపికి జోషికి మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 9 గంటల సమ యంలో శివనాగరాజు కాలనీ 12వ లైన్ లో జోషి నిలబడి ఉండగా, గోపి, హర్ష, రత్న అనే ముగ్గురు కత్తులు తీసుకొని జోషిని హత్య చేసేందుకు యత్నించారు. ఈ విష యం గ్రహించిన జోషి వారి నుంచి తప్పించుకుని పారిపోయాడు. గోపి పై హత్యకేసుతో పాటు పలు కేసులు నమోదై ఉన్నాయి. అదేవిధంగా మిగిలిన నిందితులు హర్ష, రత్నాలపై కూడా హత్యాయత్నంతో పాటు పలు కేసులు ఉన్నాయి.

వస్త్ర దుకాణంలో చోరీ

గుంటూరు, సెప్టెంబరు 21 : స్థానిక అరండల్‌పేట మెయిన్ రోడ్డుపై ఉన్న బిందాస్ వస్త్ర దుకాణంలో చోరీ జరిగింది. దుకాణం యజమాని దేసు శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి దుకాణానికి తాళాలు వేసుకొని ఇంటికి వెళ్లారు. తిరిగిశనివారం ఉదయం వచ్చి చూడగా షట్టర్ తాళాలు పగలకొట్టి ఉండటాన్ని ఆయన గమ నించారు. లోపలికి ప్రవేశించిన దొంగలు క్యాష్ కౌంటర్లోని రూ. 8 వేల నగదు అప హరించుకుపోయారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది.

వినాయక విగ్రహ ఊరేగింపులో స్వల్ప ఉద్రిక్తత

గుంటూరు, సెప్టెంబరు 21 : స్థానిక కొరిటెపాడు సెంటర్‌లో వినాయక విగ్రహం నిమజ్జనం ర్యాలీలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. హనుమయ్యనగర్‌కు చెందిన వైసీపీ వర్గీయులు వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. శనివారం రాత్రి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు ఊరేగింపుగా తీసుకొని వెళ్తున్నారు. ఈ ర్యాలీలో వైసీపీ పాటలు పెట్టుకుని, డ్యాన్స్‌లతో వస్తుండగా కొరిటెపాడు సెంటర్లో ఓ యువ కుడు టీడీపీ జెండా ఊపాడు. దీంతో ర్యాలీలో ఉన్న వైసీపీ వర్గీయులు రెచ్చి పోయారు. ఆ యువకుడిపై దాడి చేసేందుకు యత్నించారు. బందోబస్తులో ఉన్న పోలీ సులు వారిని అడ్డుకునేందుకు యత్నించినా వైసీపీ వర్గీయులు వెనక్కు తగ్గలేదు. పరిస్థితి చేయి దాటిపోతుందని భావించిన పోలీసు ఉన్నతాధికారులు వెంటనే పెద్ద సంఖ్యలో పోలీసుల బలగాలను ఘటన స్థలానికి పంపారు. వైసీపీ వర్గీయుల నిమజ్జన ఊరేగింపును ముందుకు పంపడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

మౌలిక వసతుల కల్పనకు జీఎంసీతో పాటు ఇతర శాఖలూ కలిసి రావాలి

● అన్ని శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు


వివిధ శాఖల అధికారులతో సంయుక్త సమావేశంలో మాట్లాడుతున్న జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 21: నగర సుందరీకరణ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు జీఎంసీతోపాటు ఇతర శాఖలు కూడా కలిసి రావాలని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సంయుక్త సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వాయు కాలుష్య ట్రాఫిక్ నియంత్రణ, రోడ్లు, డ్రైయిన్లపై ఆక్రమణల తొలగింపునకు జీఎంసీతో పాటుగా ట్రాఫిక్ పోలీస్, డీటీసీ, విద్యుత్, కాలుష్య నియంత్రణ మండలి, ఆర్టీసీ, ఆర్ అండ్ బి శాఖల సమ న్వయంతో సంయుక్త కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. స్వచ్ఛతా హి సేవా లో భాగంగా స్వచ్ఛ నగరంగా మార్చు కోవడానికి అక్టోబర్ 2 వరకు వివిధ కార్యక్రమాలు విరివిగా ప్రజల భాగ స్వామ్యంతో చేపడుతున్నామన్నారు. నగరంలో ప్రధానంగా వాతావరణ కాలు ష్యానికి కారణమైన లైఫ్ టైం ముగిసిన వాహనాలను రవాణా శాఖ అధికారులు కట్టడి చేయాలని, జీఎంసి చెందిన అటువంటి వాహ నాలను నిబంధనల మేరకు స్క్రాప్ కి పంపాలని ఆదేశాలు ఇవ్వా మన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ శాఖతో పాటు ఆర్టీసీ అధికారులు కూడా సహకరించాలని, అందుకు తగిన తోడ్పాటును జీఎంసీ నుండి అంది స్తామన్నారు. ప్రధాన రోడ్ల వెంబడి, ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపా రాలు చేసే వారికి విద్యుత్ సౌకర్యం తొలగించాలని, నూతనంగా ఎక్కడా కనెక్షన్ ఇవ్వొద్దని సీపీడీసీఎల్ అధికారులకు స్పష్టం చేశారు. త్వరలో న గరంలో వెండింగ్ జోన్లు, ఫుడ్ కోర్ట్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్ల వెం బడి అనారోగ్యకర వాతావరణంలో ఆహార పదార్థాలు విక్ర యిస్తున్న వారిపై క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని అధికారులకు తెలిపారు. నగరంలోని ఆర్ అండ్ బీ రోడ్లపై ఆక్రమణలపై నివేదిక ఇవ్వా లని, నగర పాలక సంస్థ పరిధిలోని ఆర్‌అండ్‌బీ రోడ్లను జీఎంసీకి బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన లేఖలు అందిస్తా మని తెలి పారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ శ్యాం సుం దర్, ఎంహెచ్ఓ మధుసూదన్, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, ఆర్టీఓ సత్యనారా యణ ప్రసాద్, సీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసబాబు, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఎస్ఈ నాగిరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం రవికాంత్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్ర రావు, ఎంఈఓ నాగేంద్రమ్మ, జీఎంసీ మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

రైలుపేటలో 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజలకు మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కార లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథ కాలను అమలు చేస్తుందని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక రైలుపేటలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా స్థానిక కార్పొరేటర్ పి.సమత, అధికారులతో కలిసి కమిషనర్ పాల్గొన్నారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ టీ.వెంకట కృష్ణయ్య, ఎంహెచ్ఓ రామారావు, ఎస్ఎస్ అయుబ్ ఖాన్, ఉపా సెల్సి పిఓ వేణుబాబు, వార్డ్ సచివాలయ విభాగ సూపరింటెండెంట్ శివన్నా రాయణ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీఎల్‌వోల ఇంటింటి ఓటర్ సర్వే

గుంటూరు నగరపాలక సంస్థ పరిధి లోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో బీఎల్ఓలు ఇంటింటి ఓటర్ సర్వే చేస్తున్నారని, కేంద్ర ఎన్నికల సంఘం నుండి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు సర్వేలో పాల్గొని పరిశీలించవచ్చని తూర్పు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ), నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం కమిషనర్ చాంబర్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 పై రాజకీయ పార్టీల ప్రతి నిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వారి ఆదేశముల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025లో భాగంగా బీఎల్ఓలు నగరంలోని 2 నియోజకవర్గాల్లో ఇంటింటి ఓటర్ సర్వే చేస్తున్నారన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పోలింగ్ స్టేషన్‌కు ఒకరిని చొప్పున బూత్ లెవల్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చని, సర్వేని వారు పరిశీలించవచ్చని తెలిపారు. పోలింగ్ కేంద్రాలపై ఏవిధమైన అభ్యంతరాలు ఉన్నా రాతపూర్వకంగా అందిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు. స్పెషల్ సమ్మరి రివిజన్‌లో భాగంగా బీఎల్ఓలు అక్టోబర్ 18 వరకు ప్రతి ఇంటిని సందర్శించి అర త కలిగిన, కొత్తగా నమోదు కావలసిన ఓటర్ల నమోదు, నగరం నుండి శాశ్వతంగా వదిలి వెళ్ళిన వారిని, మరణించిన వారిని తొలగించుటకు, ఇంటి నంబర్లు, ఇతర వివరాలలో ఉన్న తప్పుల సవరణకు చర్యలు తీసుకుంటారన్నారు. బీఎల్ఓ లతో పాటు బూత్ లెవల్ ఏజెంట్ లు పాల్గొని సహకరించేలా రాజకీయ పార్టీలు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మేనేజర్ ఎస్ఎన్ ప్రసాద్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎల్.పద్మ, నాయుడు ఓంకార్ (టీడీపీ), పాండురంగ విఠల్ (బీజేపీ), డీ.జాన్‌బాబు (వైఎస్సార్సీపీ), బి.సునీల్‌కుమార్ (ఇండియన్ నేషనల్ కాం గ్రెస్), సీహెచ్.వాసు (బీఎస్పీ), ఎస్కే ఖాసిం (సిపిఐ(ఎం), టీ.సేవా కుమార్ (ఆప్) పాల్గొన్నారు.

మైనర్ల డ్రైవింగ్, ఈవ్‌టీజింగ్‌పై కఠినంగా వ్యవహరించండి

● ఎస్పీకి ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాల వినతి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, సెప్టెంబరు 21 : మైనర్ల డ్రైవింగ్, ఈవ్ టీజింగ్, ట్రాఫిక్ సమస్యలపై కఠినంగా వ్యవహరించాలని నగరంలోని ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు కోరాయి. ఈ మేరకు శనివారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నగరంలో ఉన్న ప్రైవేటు స్కూల్స్ ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ సమా వేశానికి హాజరైన వారి వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల యాజమాన్యాలకు సం బంధించిన సమస్యలను తెలుసుకున్న ఎస్పీ, వాటి పరిష్కారానికి సాను కూలంగా స్పందించారు. స్కూల్, కాలేజీల యాజమాన్యాల సభ్యు లకు పోలీసు శాఖ అండగా నిలిచి పరిష్కరించడానికి కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నగరంలో ఉన్న ప్రైవేటు స్కూల్స్ , ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల తెలియ జేసిన సమస్యల్లో ఎక్కువగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యలు, మైనర్ పిల్లల డ్రైవింగ్, ఈవ్ టీజింగ్, మైనర్లు వాహనాలను నడపడం, మైనర్లు వాహనాలను నడిపితే వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ గురించి, ప్రైవేటు స్కూల్స్ ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు వినతిపత్రం సమర్పించి నట్లు చెప్పారు. ఆయా సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని, పోలీసు శాఖ తరపున సహకారం వుంటుందని హామీ ఇచ్చారు. ఏదైనా సంఘటన జరిగితే స్థానిక పోలీస్ అధికారులకు (లేదా) డయల్ 100, 8688831568 నంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి సీతారామయ్య, స్పెషల్ బ్రాంచ్ సిఐ అళ్ళహరి శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరావు, పోలీసు అసోసియేషన్ సభ్యులు కరిముల్లా, లక్ష్మణ్, హుస్సేన్ పాల్గొన్నారు.


వాడ్రేవు సుందరరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

గురజాడ సాహిత్య పురస్కారం ప్రదానం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 21: తెలుగు నాటక రంగానికి విశేష కృషి చేసిన నాటక రచయిత వాడ్రేవు సుందరరావుకు మహాకవి గురజాడ సాహితీ పురస్కారంతో ఘనంగా సత్కరించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై శనివారం వింజనంపాడు స్నేహా ఆర్ట్స్ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు 162వ జయంతి సందర్భంగా ఈ పురస్కార సభ జరిగింది. సుందరరావును సంస్థ కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం గుంటూరు-స్వర్ణభారతి కల్చ రల్ ఆర్ట్స్, నెమలికంటి వెంకట రమణ రచన, దర్శకత్వం వహించిన 'మీరైతే?' నాటిక సందేశాత్మకంగా సాగింది. ముఖ్యఅతిథిగా నాటక రచయిత, నాటకరంగ పరిశోధకులు డాక్టర్ కంది మళ్ళ సాంబశివరావు, ఆత్మీయ అతిథులుగా రంగస్థల ప్రము ఖులు వైఎస్ కృష్ణేశ్వరరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సభాధ్యక్షులుగా నటులు, రచయిత, దర్శకులు నెమలికంటి వెంకట రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీ.సాంబశివరావు, షేక్ చిన ఆదం షఫీ, బీ.గోపాల్‌రెడ్డి, వీ.మధు, ఏ.వెంకట చంద్రశేఖర్ పాల్గొని కళా కారులను సత్కరించారు.


కమిషనర్ పులి శ్రీనివాసులకు వినతిపత్రం అందజేస్తున్న కొరిటెపాడు వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాజీ, గోపాల కృష్ణారెడ్డి, కోటేశ్వరరావు తదితరులు

కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి సహకరించండి

కమిషనర్ పులి శ్రీనివాసులకు అభివృద్ధి కమిటీ వినతి

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 21: నగరంలోని కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి సహకరించాలని జీఎంసి కమిషనర్ పులి శ్రీని వాసులు కోరారు. ఈ మేరకు శనివారం కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ అభి వృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కమిషనర్‌ని కలిశారు. తొలుత ఆయనను సత్క రించారు, అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై స్పందిం చిన కమిషనర్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి పూర్తిస్థాయిలో నిధులు మం జూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షులు కన్నసాని బాజీ.సెక్రటరీ బెజవాడ శివరామకృష్ణ రెడ్డి, ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ కోటే శ్వరరావు, ఒంటెద్దు ఓబులరెడ్డి, అన్నం గంగాధర్, గల్లా గురుపాదం సత్య నారాయణ, సుంకర రామక్రిష్ణారెడ్డి, చెలికాని సీతారామయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, పక్కన షబీల, చిట్టిబాబు

పేదలను అక్కున చేర్చుకున్న 'మంచి ప్రభుత్వం'

● ఎమ్మెల్యే మొహమ్మద్‌నసీర్

గుంటూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పేదలను అక్కున చేర్చు కున్నది కనుకనే తమది మంచి ప్రభుత్వమని ప్రజలు కొనియాడుతున్నా రని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియో జకవర్గంలోని వసంతరాయపురం, వెంగళరావునగర్‌లో 'ఇది మంచి ప్రభు త్వం' రెండో రోజు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నసీర్ మాటా డుతూ నియోజకవర్గంలో గతంలో ఏ ప్రజాప్రతినిధి కాలుపెట్టని చిన్న కాలనీల్లో కూడా పర్యటించి శానిటేషన్, సీసీ రోడ్లు, వీధి దీపాలు, ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేస్తున్న కూటమి ప్రభుత్వం, మంచి ప్రభుత్వం అని ప్రజలు చెబుతున్నారని అన్నారు. కార్య క్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సిహెచ్ చిట్టిబాబు, కార్పొరేటర్లు షబీల, భారతి, దయారత్నం, ప్రభాకర్, రాజా, నరసింహారావు, రమాదేవి, మల్లిక, బాబురావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సేవాభావం అభినందనీయం

గుంటూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు అండగా నిలిచిన విద్యార్థుల సేవాభావం అభినంద నీయమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక పాత గుంటూరులోని పెరల్స్ స్కూల్ విద్యార్థులు విజయ వాడ వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ. 60 వేల చెక్కును ఆయన చేతుల మీదుగా సీఎం సహాయ నిధికి అందజేశారు. తమ తల్లి దండ్రులు విద్యార్థులకు రోజువారి ఖర్చులకు ఇచ్చే డబ్బులను జమ చేసి విజయవాడ వరద బాధితుల కోసం ఈ మొత్తం అందించడం గొప్ప విష యమని ఎమ్మెల్యే ప్రశంసించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, కార్పొరేటర్ మీరావలి, స్కూల్ డైరెక్టర్ బాబురావు, సాయికిరీటి, శేఖర్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'హిందీ' నేర్చుకోవడం సులభం

గుంటూరు(విద్య),సెప్టెంబరు 21: విద్యార్థులు తమ మాతృభాషపై పట్టు సాధిస్తే హిందీ భాష నేర్చుకోవడం ఎంతో సులభమని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర ప్రచార అధికారి ఆర్.రమేష్ చంద్ర అన్నారు. సీబీసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిను లకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళా శాల ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోత్స్నకుమారి పాల్గొన్నారు.

మిర్చి యార్డు 'స్నేహ హస్తం'చేయూత


బాధితునికి ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహ హస్తం ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు

గుంటూరు, సెప్టెంబరు 21: మిర్చియార్డు స్నేహ హస్తం ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆపన్న హస్తం అందించింది. గత నెలలో చిలకలూరిపేట బైపాస్ వద్ద జరిగిన ప్రమా దంలో తీవ్ర గాయాలపాలై ఆసు పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరిన మిర్చియార్డు గుమస్తా సోదరుడు లక్ష్మయ్యకు రూ. లక్షా 12 వేలు ఆర్థిక సాయం అందించింది. స్థానిక అంకిరెడ్డిపాలెంలోని ఆయన నివా సానికి వెళ్ళి ఈ ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు స్నేహ హస్తం అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ భార్గవ్ తేజ తదితరులు

గురజాడ అప్పారావుకు ఘన నివాళి

గుంటూరు సిటీ, సెప్టెంబరు 21 : అభ్యుదయ కవితా పితామహుడుగా బిరుదు గాంచిన గురజాడ వెంకట అప్పారావు 162 వ జయంతిని గుంటూరు కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ,డిజాస్టర్ మేనేజ్మెంట్ డీపీఎం లక్ష్మీ కుమారి, జిల్లా రెవిన్యూ అధికారిణి పెద్ది రోజాలు గురజాడ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్య క్రమంలో కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక తెలుగు సాహిత్యానికి నూతన ఒరవడి 'గురజాడ'

గుంటూరు, సెప్టెంబరు 21: ఆధునిక తెలుగు సాహిత్యానికి గురజాడ అప్పారావు నూతన ఒరవడి దిద్దారని సాహితీవేత్త ముప్పాళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురజాడ చిత్రపటానికి నివా ళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, గూడవల్లి నాగే శ్వరరావు, జమదగ్ని, పింగళి భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కవి కుమార్‌రాజుకు ప్రశంసా పత్రం

గుంటూరు, సెప్టెంబరు 21: కవి, రచయిత, ఆంధ్ర ప్రదేశ్ రచయితల సంఘం కార్యదర్శి, శ్రీశ్రీ కళా వేదిక ఉపాధ్యక్షులు, గుంటూరు జిల్లా రచయితల సంఘం కార్యదర్శి, బుర్రి కుమార్ రాజు ప్రశంసాపత్రం అందుకున్నారు. గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా నిర్వహించిన కవితల పోటీలో ఆయన రాసిన కవిత ఉత్తమ కవితగా ఎంపిక కావడంతో ఈ ప్రశంసాపత్రం లభించింది. ఈ సందర్భంగా కుమార్ రాజును గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షురాలు చిల్లర భవానీదేవి, ఉపాధ్యక్షులు బొమ్ము ఉమా మహేశ్వరరెడ్డి, కోశాధికారి నానా, సాహితీ చైతన్య కిరణాలు అధ్యక్షులు డాక్టర్ బోగెల ఉమామహేశ్వరరావు (ఉమా కవి), ఉపాధ్యక్షులు పి. దేవానంద్, శ్రీ శ్రీ కళా వేదిక అధ్యక్షుడు రంగిశెట్టి రంగయ్య అభినందించారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, పాశం రామారావు తదితరులు

27న జాషువా జయంతి సభను జయప్రదం చేయండి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 21: ఈ నెల 27న నవయుగ కవి చక్రవర్తి గుఱ్ఱం జాషువా 129వ జయంతి సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. శనివారం స్థానిక బ్రాడీపేటలోని గుఱ్ఱం జాషువా విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ గుఱ్ఱం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఈ జయంతిసభ జరుగుతుందని చెప్పారు. ప్రముఖ సాహితీవేత్త, పుస్తక సమీక్షకులు గుమ్మా సాంబశివరావు, 'పాడుదమా స్వేచ్ఛా గీతం' రచయిత గంటేడ గౌరునాయుడులకు జాషువా సాహిత్య పురస్కారాన్ని అందజేయ నున్నట్టు తెలిపారు. ముఖ్యవక్తలుగా మాజీ ఎమ్మెల్సీలు ఎంవీఎస్‌శర్మ, వి.బాల సుబ్ర హ్మణ్యం, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కే.మోహన్ పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో గుఱ్ఱం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు, సీపీఎం నాయకులు అప్పారావు, కిరణ్, వై.కృష్ణకాంత్, డీ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

24న అండర్-19 క్రీడాకారుల ఎంపిక

గుంటూరు(విద్య),సెప్టెంబరు 21: జిల్లాలోని జూనియర్ కళాశాల్లో ఇం టర్ చదివే విద్యార్థులకు నిర్వహించే క్రీడా ఎంపికలు ఈ నెల 24న నిర్వ హిస్తున్నట్లు స్కూల్‌గేమ్ ఫెడరేషన్ కా ర్యదర్శి జీ.నరసింహారావు ఒక ప్రకటన లో తెలిపారు. ఈ నెల 24న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల (అచ్చంపేట)లో రెజ్లింగ్, గుంటూరు లోని గోరంట్లలో ఉన్న కెనడీ నెక్స్‌జెన్ స్కూల్‌లో మోడరన్ పెంటాథ్లన్, బాప ట్లలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలి కల గురుకుల కళాశాలలో బాస్కెట్ బాల్, చిలకలూరిపేటలోని ఏఎంజీ కళాశాలలో బాక్సింగ్ ఎంపికలు నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. ఆయా ఎంపి కల్లో పాల్గొనే విద్యార్థినీవిద్యార్థులు 2006 జనవరి 1 తర్వాత జన్మించి ఉం డాలని, పదవ తరగతి మార్కుల జాబితా జిరాక్స్‌పై ప్రిన్సిపల్ సంతకం చేయించుకుని ఎంపికలకు రావాలని తెలిపారు.

బీజేపీ లో చేరిన 'ముప్పాళ్ల'

గుంటూరు సిటీ, సెప్టెంబరు 21 : ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ళ సత్య సాయిబాబా శనివారం భారతీయ జనతా పార్టీలో చేరారు. సీనియర్ నాయ కులు జూపూడి రంగరాజు సమ క్షంలో ఆయన బీజేపీ తీర్థం పుచ్చు కున్నారు. సత్యసాయిబాబు మాటా డుతూ ప్రధాని నరేంద్ర మోడీ సార థ్యంలోని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభు త్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సం క్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసు కెళ్లి పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. గుంటూరు జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్రకుమార్, కామరాజు దుర్గాప్రసాద్, సీహెచ్ కుమార్ గౌడ్, బీ.చంద్రశేఖర్, వీ. వీర సుధాకర్ పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడుగా విజయ్‌కుమార్ ప్రమాణస్వీకారం నేడు

గుంటూరు, సెప్టెంబరు 21: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడుగా ఇటీవల నియ మితులైన తాడికొండకు చెందిన చిలకా విజయ్ కుమార్ ఆదివారం ఉదయం రాజీవ్‌గాంధీభవన్‌లోప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సంద ర్భంగా లాడ్జి సెంటర్‌లోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి అక్కడ నుంచి కార్యకర్తలు ర్యాలీగా రాజీవ్‌గాంధీ భవన్‌కు చేరు కుంటారని ఆ పార్టీ నాయకుడు బిళ్ళా సునీల్‌కుమార్ తెలిపారు. మాజీ ఎమ్మె ల్యేలు లింగంశెట్టి ఈశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు చెప్పారు.

GENERAL NOTICE
IN THE COURT OF THE PRL. DIST. JUDGE:: GUNTUR
G.W.O.P. No. 913 / 2024

Between:
Karasani Ganesh Kumar Reddy, S/o. Raghava Reddy, R/o. Door No. 3-14-125, 2nd Line, Pattabhipuram, Guntur. ...Petitioner
And
Nill ..... Respondent

పైనెంబరు జి.డబ్ల్యు.ఓ.పి.ని పిటీషనరు తన మైనరు కుమారుడు కారసాని రుత్విక రెడ్డి యొక్క విద్యా బుద్ధులు, బాగోగులు వగైరాల కొరకు మైనరు తాలూకు ఆస్తిని అమ్ముట కొరకు పర్మిషన్ కోరుతూ పిటీషన్ దాఖలుచేయగా సదరు పిటీషన్‌పై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు వగైరాలు ఉన్న యెడల తెలుపుకొన వలసినదిగా కోరుచూ శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తం ది.15-10-2024 నకు వాయిదావేసినారు. కావున సదరు వాయిదా రోజు ఉ॥గం॥10-30ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరై తమకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీపరోక్షమున తీర్మానించబడును.

Schedule: Property situated at Guntur Dt., Koritepadu Sub-Dist., Gorantla Gram Panchayat, Presently Guntur Municipal Corporation area, Koritepadu(V),D.No. 129 an extent of Ac.1-98 cents in which an extent of Ac.0-05cents; D.No.130 an extent of Ac.7-94 cents in which an extent of Ac. 3-77 cents, both being contiguous an extent of Ac.3-82 cents out of which an extent of Ac.1-50 cents in which site left for Roads comes to an extent of 5765.32 which was divided into plots and plot No's. 2&3 in an extent of 400 Sq.Yds. of site is being bounded by **East:**30Ft. width Road 66.6Ft., **South:**Property belongs to Yakkaluri Vaidehi,55.1 Ft., **West:**Plot No's. 1&2,64.3Ft., **North:**Plot No. 18,55Ft. Within these boundaries an extent of 400 Sq.Yds or 334.44 Sq.Mts of vacant site.

VANUKURI VENKATA SUBBA REDDY
P. NAGA SRINIVASA RAO,
Advocates for Petitioner,
Guntur. Cell:9177646766

GENERAL NOTICE
IN THE COURT OF THE PRL. DIST. JUDGE:: GUNTUR
G.W.O.P. No. 912 / 2024

Between:
Karasani Ganesh Kumar Reddy, S/o. Raghava Reddy, R/o. Door No. 3-14-125, 2nd Line, Pattabhipuram, Guntur. ... Petitioner
And
Nill ...Respondents

పైనెంబరు జి.డబ్ల్యు.ఓ.పి.ని పిటీషనరు తన మైనరు కుమార్తె కారసాని శ్రీ విష్ణు కార్తీక యొక్క విద్యా బుద్ధులు, బాగోగులు వగైరాల కొరకు మైనరు తాలూకు ఆస్తిని అమ్ముట కొరకు పర్మిషన్ కోరుతూ పిటీషన్ దాఖలుచేయగా సదరు పిటీషన్‌పై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు వగైరాలు ఉన్న యెడల తెలుపుకొన వలసినదిగా కోరుచూ శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తం ది.15-10-2024 నకు వాయిదావేసినారు. కావున సదరు వాయిదా రోజు ఉ॥గం॥10-30ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరై తమకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీపరోక్షమున తీర్మానించబడును.

Schedule: Property situated at Guntur Dt., Koritepadu Sub-Dist., Gorantla Gram Panchayat, Presently Guntur Municipal Corporation area, Koritepadu(V),D.No. 129 an extent of Ac.1-98cents in which an extent of Ac.0-05cents; D.No.130 an extent of Ac.7-94 cents in which an extent of Ac. 3-77cents, both being contiguous an extent of Ac.3-82cents out of which an extent of Ac.1-50 cents in which site left for Roads comes to an extent of 5765.32 which was divided into plots and plot No's. 2&3 in an extent of 400Sq.Yards of site is being bounded by **East:** Plot No.18 and some part of Plot No.19,70.6 Ft., **South:** Plot No.1,50.1Ft., **West:**30Ft Width Road,70.6Ft., **North:**Plot No.4,52Ft. Within these boundaries an extent of 400 Sq. Yards or 334.44 Sq. Mts of vacant site.

VANUKURI VENKATA SUBBA REDDY
P. NAGA SRINIVASA RAO,
Advocates for Petitioner,
Guntur. Cell:9177646766



ఏపీలో దేవర టికెట్ ధరలు పెంపు



జూనియర్ ఎన్టీఆర్ నటించిన పాన్ ఇండియా సినిమా 'దేవర' టిక్కెట్ల ధరలు పెంపు, స్పెషల్ షో లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నెల 27న విడుదల అవుతోన్న ఈ సినిమా మొదటి రోజు ఆరు షో లు.. అక్టోబరు 9వరకూ ఐదు షో ల చొప్పున రాష్ట్రంలో రిలీజైన అన్ని థియేటర్లలో ఆడించుకోవచ్చు. టిక్కెట్ ధరలు పెంచుకోవడానికి నిర్మాతల వినతిని పరిశీలించిన ప్రభుత్వం 60రూపాయల నుంచి 135రూపాయల వరకూ పెంచుకొనేందుకు అనుమతిచ్చింది. మొదటి రోజు అర్ధరాత్రి 12గంటలకు బెనిఫిట్ షో, ఉదయం ఆరింటికే మార్నింగ్ షో నుంచే సినిమా ప్రదర్శనకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మాతలకు అనుమతి ఇచ్చింది. విడుదలైన రెండో రోజు(28) నుంచి తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజూ ఐదు షో లు ప్రదర్శించుకోవచ్చు. అక్టోబరు 6తర్వాత సాదారణ ప్రదర్శనలు ఉంటాయి.

వేధించడం మా విధానం కాదు : పవన్ కల్యాణ్



'రాజకీయాలకు అతీతంగా చిత్ర పరిశ్రమకు మేలు చేయాలనేదే చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానం. వైకాపా ప్రభుత్వం తరహాలో నిర్మాతలను, సినీ నటులను వేధించడం మా ప్రభుత్వ విధానం కాదు' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించిన 'దేవర' చిత్రం ప్రత్యేక ప్రదర్శనలు, టికెట్ ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతించిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ఎన్టీఆర్, నిర్మాణ సంస్థ ఎన్టీఆర్ ఆర్ట్స్ బేనర్ ట్వీట్ చేసింది. దీనిపై పవన్‌కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'వైసీపీ పాలనలో సినీ ప్రముఖులు ఎన్ని కష్టాలు పడ్డారో నాకు తెలుసు. వ్యక్తులు, రాజకీయాలతో మాకు సంబంధం లేదు, పరిశ్రమను మేం గౌరవిస్తాం. మీ సినిమాకు మంచి జరగాలి' అని 'దేవర' యూనిట్‌కు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)



వెంకీ షూటింగ్‌లో బాలయ్య

అగ్ర హీరోల షూటింగ్స్ ఒకేచోట జరుగుతున్నప్పుడు ఒక హీరో సెట్‌కు మరో హీరో వెళ్లడం, సరదాగా కాసేపు గడపడం, సినిమాల గురించి మాట్లాడుకోవడం గతంలో ఓ అలవాటుగా, సంప్రదాయంగా ఉండేది. హీరోల మధ్య ఐకమత్యానికీ, స్నేహబంధానికీ అటువంటి సంఘటనలు అద్దం పట్టేవి. చాలా రోజుల తర్వాత నందమూరి బాలకృష్ణ మళ్లీ ఆ సంప్రదాయాన్ని గుర్తుకు తెచ్చారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న తాజా చిత్రం షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఆ సమయంలో అక్కడే ఉన్న బాలకృష్ణ ఈ విషయం తెలుసుకుని వెంకటేశ్ షూటింగ్ స్పాట్‌కు వెళ్లి సందడి చేశారు. బాలయ్య, వెంకీ మంచి స్నేహితులు. అలాగే అనిల్ రావిపూడి బాలయ్యతో 'భగవంత్ కేసరి' చిత్రం రూపొందించారు. బాలయ్య రాకతో టీమ్ చాలా థ్రిల్ అయింది.



వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎన్టీఆర్ తనయుడు, ఛాయాగ్రాహకుడు నందమూరి మోహనకృష్ణ, ఆయన కుమార్తె మోహన రూప శనివారం కలసి రూ. 25 లక్షల విరాళం చెక్కు అందజేశారు.

రజనీ.. ఓ సుప్రీమ్ స్టార్



రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ 33 ఏళ్ల తర్వాత కలసి నటించిన సినిమా 'వేట్టయాన్'. తాజాగా ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమాన్ని చెన్నైలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమితాబ్ బచ్చన్ గురించి రజనీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ "ఒకానొక సమయంలో అమితాబ్ బచ్చన్ సినీ నిర్మాతగా భారీ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయారు. తన దగ్గర పనిచేసే వాచ్‌మెన్‌కు కూడా జీతం ఇవ్వలేని పరిస్థితి. ఏం చేయాలో అర్థం కాక తనకు ఎంతో ఇష్టమైన జూహూ ఇంటిని వేలానికి పెట్టారు. అప్పుడు బాలీవుడ్ మొత్తం ఆయన్ను చూసి నవ్వింది. కానీ ఆ క్లిష్ట పరిస్థితుల నుంచి కోలుకుని.. మరో మూడేళ్లలో.. వరుస సినిమాలు..'కౌన్ బనేగా కరోడ్‌పతి' షోతో మళ్లీ నిలదొక్కుకున్నారు. జూహూలోని తన ఇంటితో పాటు మరో మూడు ఇళ్లను అమితాబ్ తిరిగి కొనుగోలు చేశారు" అని రజనీ చెప్పారు. ఈ వేడుకకు హాజరు కాలేకపోయినా.. అమితాబ్ ఓ వీడియో పంపి అభిమానులను ఖుషీ చేశారు. ఆ వీడియోలో అమితాబ్ మాట్లాడుతూ "ఇది నా తొలి తమిళ చిత్రం. రజనీకాంత్.. అందరిలో ఓ సుప్రీమ్ స్టార్. 1991లో రజనీ, నేను కలసి నటించిన చిత్రం 'హమ్'. ఇందులో రజనీ నా సోదరుడిగా నటించారు. షూటింగ్ విరామంలో నేను ఏ.సీ కార్‌లో విశ్రాంతి తీసుకునే సమయంలో.. రజనీ ఫిల్మ్ సెట్స్‌లో కింద పడుకునేవారు. ఈ చిన్న ఉదాహరణ చాలు ఆయన ఎంత సింపుల్‌గా ఉంటారో చెప్పడానికి" అని అన్నారు.

అమితాబ్ కోసం ప్రకాశ్‌రాజ్...

ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్ పాత్ర తమిళ్ వెర్షన్‌కు నటుడు ప్రకాశ్‌రాజ్ డబ్బింగ్ చెప్పడం విశేషం. సినిమాలో రజనీ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా కనిపించనున్నారు. అమితాబ్, రజనీకి సీనియర్‌గా సత్యదేవ్ అనే పాత్రలో నటిస్తున్నారు. టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం దసరా సందర్భంగా అక్టోబర్ 10న విడుదలవుతోంది.

మా మధ్య అలాంటి సంబంధం లేదు



తన భార్య ఆర్తి రవికి విడాకులు ఇవ్వాలని తాను తీసుకున్న నిర్ణయాన్ని తన తల్లిదండ్రులు అంగీకరించారని, తన సంతోషమే వారికి ముఖ్యమని హీరో 'జయం' రవి స్పష్టం చేశారు. ఆయన నటించిన తాజా చిత్రం 'బ్రదర్' సినిమా ఆడియో విడుదల వేడుక శనివారం చెన్నైలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. "ఇంతకాలం ఇండస్ట్రీలో ఎలాంటి గాసిప్స్ లేకుండా జీవితాన్ని గడిపాను. ఇపుడు నాకు, పరాయి స్త్రీకి సంబంధం ఉన్నట్టు ప్రచారం చేస్తున్నారు. ఇది చాలా తప్పు. గాయని కెనీషాకు నాకు మధ్య ఎలాంటి సంబంధం లేదు. ఎంతోమందికి ఆమె ప్రాణం పోశారు. ఆర్తికి తెలియకుండా విడాకుల నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటన చేశారు. విడాకుల విషయంపై రెండు సార్లు నోటీసులు పంపించాను. ఇదే విషయంపై ఆర్తి తండ్రి వచ్చి నా తల్లిదండ్రులతో చర్చించారు. ఇంత జరిగినా తనకు తెలియకుండా తీసుకున్నట్టు చెప్పడం షాకింగ్‌కు గురిచేసింది. విడాకుల గురించి నా పెద్ద కుమారుడికి కూడా వివరించాను. అందరు పిల్లల్లాగే అతను కూడా మేమిద్దరం కలిసి వుండాలని కోరాడు. నా ఇద్దరు కుమారులు నా వద్దనే ఉంటున్నారు. ఇపుడు నేను కోరేది ఒక్కటే.. ప్రైవేట్ లైఫ్ ప్రైవేట్ లైఫ్‌గానే ఉండనివ్వండి. గాయని కెనీషా 600కు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఎంతోమంది ప్రాణాలు కాపాడారు. మేమిద్దరం ఒక హీలింగ్ సెంటర్‌ను నెలకొల్పి అనేక మందికి సాయం చేయాలని ప్లాన్ చేస్తున్నాం. దాన్ని పాడు చేయవద్దు. అనవసరంగా నా గురించి, కెనీషా గురించి చెడుగా మాట్లాడవద్దు' అని కోరారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

రవికుమార్ చౌదరి ఫ్లాష్‌బ్యాక్ ఏమిటి?



'యజ్ఞం', 'పిల్లా నువ్వు లేని జీవితం' వంటి హిట్ చిత్రాలు అందించి, ఇటీవల రాజ్‌తరుణ్ నటించిన 'తిరగబడరా సామీ' తో మరో విజయం అందుకొన్న దర్శకుడు రవికుమార్ చౌదరి తన కొత్త చిత్రం వివరాలు వెల్లడించారు. 'ఫ్లాష్‌బ్యాక్' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో ఈ సినిమా ఉంటుందని, న్యూ ఏజ్ లవ్‌స్టోరీగా రూపొందుతుందని ఆయన తెలిపారు. 'లేనిది ఎవరికి?' అనేది ట్యాగ్ లైన్. ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌కు రచన: డైమండ్ రత్నబాబు, పాటలు: సుద్దాల అశోక్ తేజ, వరంగల్ శ్రీను, సంగీతం: జేబీ, ఛాయాగ్రహణం: ప్రభాకరరెడ్డి, సమర్పణ: రిగ్వేద చౌదరి. నటీనటులు, ఇతర వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాత కార్తీక్ రెడ్డి రాకాసి చెప్పారు.

రొమాంటిక్ కామెడీ డ్రామా



'హీరో' ఫేమ్ అశోక్ గల్లా, గౌరి ప్రియ జంటగా ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. ఉద్భవ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "రొమాంటిక్ కామెడీ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను త్వరలోనే మొదలెట్టనున్నాం. అందరినీ కడుపుబ్బా నవ్వించే ఈ చిత్రంలో గుండెలకు హత్తుకునే డ్రామా కూడా ఉంటుంది" అని చెప్పారు.





తెనాలి వార్తలు



జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మురళి,నాగభూషణం, ఇతర నాయకులు

తిరుమల లడ్డు ప్రసాదాన్ని కలుషితం చేసిన నిందితులను శిక్షించాలి

- జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి దహనం
- గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ నేత వీరవల్లి మురళి

తెనాలి రూరల్, సెప్టెంబరు 21: తిరుమల లడ్డు ప్రసాదం కలుషితం చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలతో చెలగాటమాడిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, అప్పటి పాలకమండలి వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, కరుణాకర్ రెడ్డిలను కఠినంగా శిక్షించాలని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ నేత వీరవల్లిమురళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అంగలకుదురు గణేష్‌యూత్ ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ విగ్రహం వద్ద లడ్డు ప్రసాదాన్ని జంతువుల కొవ్వుతో కలుషితం చేసిన తీరును నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను నడిరోడ్డుపై పెట్టి చెప్పులతో కొట్టి దహనం చేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు దుర్మార్గమన్నారు. ప్రసాదం తయారీలో ప్రభుత్వం, పాలకమండలి జంతువుల కొవ్వుతో అపవిత్రం చేసేలా బాధ్యతారాహిత్యంగా మెలగడాన్ని రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నారన్నారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల స్వామివారిని దర్శించిన సమయంలో లడ్డుప్రసాదాన్ని స్వీకరించకుండా తింటున్నట్లు నాటకమాడింది ఇందుకేనేమోనని అనుమానం వ్యక్తం చేశారు. కోట్లాదిమంది భక్తులకు అత్యంత ప్రీతికరమైన లడ్డును కలుషితం చేసేందుకు బాధ్యులైన వారందరినీ తక్షణమే అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించి తిరుమల పవిత్రతను, భక్తుల మనోభావాలను కాపాడాలని మురళి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. అంగలకుదురు గ్రామ ఉపసర్పంచ్ కనగాలనాగభూషణం, బొద్దులూరి వేణు, గొల్లపూడి సాయిగిరి, వెలగ ఆదినారాయణ, కాట్రగడ్డ రామకృష్ణ, చెన్నుపాటి రవీంద్ర, ప్రసాద్, సాయి, వడ్లమూడి సాంబశివరావు, కోగంటి నాగేశ్వరరావు, ఎల్ఎమ్ఎల్ ఖాదర్, పలువురు పార్టీ శ్రేణులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పవిత్రత కోరుతూ హోమం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 21 : దేశంలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుమల పవిత్రంగా ఉండాలని కోరుతూ మహిళలు హోమం చేశారు. వైకుంఠపురంలోని శ్రీలక్ష్మి పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో టీడీపీ నాయకురాలు అన్నాబత్తుని జయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా భక్తులు శనివారం నిర్వహించిన శ్రీనివాస దివ్యానుగ్రహ సంప్రోక్షణ హోమంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వం అరాచక పాలనకు పవిత్ర క్షేత్రమైన తిరుమలను కూడా వదలకపోవడం శోచనీయమని ఆమె విమర్శించారు. కోట్లాది మంది భక్తులు విశ్వసించే వెంకన్న లడ్డూ తయారీలో అనైతిక పదార్థాలను వినియోగించి భక్తుల మనోభావాలను గాయపరిచారని చెప్పారు. ప్రభుత్వం తగిన విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు.



హోమం చేస్తున్న మహిళలు

లడ్డూ కల్తీ ఘోర అపచారం : కేసన

తెనాలి అర్బన్, సెప్టెంబరు 21 : తిరుమల లడ్డూ ప్రసాదాల తయారీలో కల్తీ చేయడం ఘోర అపచారమని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. తెనాలిలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, జంతు సంబంధ కొవ్వులతో లడ్డూ తయారీకి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. దశాబ్దాల తరబడి స్వచ్ఛమైన నెయ్యిని సరఫరా చేస్తున్న వారిని కాదని కల్తీ నెయ్యితో అపవిత్రం చేసే పనికి పూనుకున్న వారిని క్షమించరాని నేరంగా పరిగణించాలన్నారు. భారతీయుల మత విశ్వాసాలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ చేయాలని కోరారు.

లడ్డుప్రసాదంపై వైసీపీ వైఖరి దుర్మార్గం

- అఖిల భారత గౌడ సంఘం జిల్లా యువత అధ్యక్షుడు వేణువర్ధన్

తెనాలి రూరల్, సెప్టెంబరు 21: భక్తులకు అందించే తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి లడ్డుప్రసాదంపై వైసీపీ అవలంభించిన వైఖరి దుర్మార్గమని అఖిలభారత గౌడసంఘం జిల్లా యువత అధ్యక్షుడు వేణువర్ధన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లడ్డు ప్రసాదం అపవిత్రమైందన్న వార్త కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని అందుకు కారకులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని తిరుమల పవిత్రతను కాపాడాలని వేణువర్ధన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తిరుపతి వైభవాన్ని తగ్గించే కుట్ర : కాంగ్రెస్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు21 : కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వరుని దివ్య క్షేత్రం తిరుపతి వైభవాన్ని తగ్గించే కుట్ర జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జక్కా శ్రీనివాస్ శనివారం ఆరోపించారు. భారతీయులకు తిరుపతి పరమపవిత్ర పుణ్యక్షేత్రం అన్నారు. తిరుపతి లడ్డుపై స్వామి వారి భక్తుల మనోభావాలతో ఆటలాడవద్దని హెచ్చరించారు. లడ్డు ప్రసాదాలలో కల్తీలు జరిగి ఉంటే విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు.

కోకోకోలా కంపెనీకి ఇచ్చిన నీటి తీర్మానాన్ని రద్దు చేయాలి

- పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శివ కోటేశ్వరావు



రక్షిత మంచినీటి పథకం పైపులను పరిశీలిస్తున్న పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం కమిటీ సభ్యులు

తెనాలి (మారీసుపేట), సెప్టెంబరు 21 : పురపాలక సంఘం కోకోకోలా కంపెనీకి ఇచ్చిన నీటి తీర్మానాన్ని వెంటనే రద్దు చేయాలని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దర్శి శివ కోటేశ్వరావు డిమాండ్ చేశారు. పట్టణంలో రక్షిత మంచినీటి పథకం పైపులైన్‌ల దుస్థితిని సంఘ సభ్యులతో కలసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానది నుంచి తెనాలికి రక్షిత మంచినీటి పైపులైన్‌ల పథకాన్ని రూ.80 కోట్లతో ప్రారంభించారన్నారు. పట్టణంలో ప్రతి ఇంటికి మంచినీటి కనెక్షన్‌లను ఇవ్వాలని ప్రతిపాదించారని తెలిపారు. ఇల్లు లేని స్థలాలలో కూడా కనెక్షన్ వేశారని విమర్శించారు. కాంట్రాక్ట్ ప్రకారం చేయవలసిన పనులను పూర్తి చేయకుండా వదిలివేసారని, ఈ పనులను విచారించి వారిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి పథకాన్ని పబ్లిక్ వర్క్స్ నుంచి పురపాలక సంఘం తీసుకున్న తరువాత సుమారు రూ.5 కోట్లు ఖర్చు చేసారని, సదరు సొమ్మును కూడా కాంట్రాక్టర్ పనులను పూర్తిచేయాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.200 కోట్లు వచ్చినప్పటికీ తాగునీటి పథకానికి సక్రమంగా అమలు చేయడంలో విఫలమయ్యారని, నిధులు దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ అంశంపై దృష్టి పెట్టి పట్టణ ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. సీతలపానీయం కంపెనీకి తాగునీరు అందించేందుకు చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శివశంకరరావు, సోమయ్యశాస్త్రి, రమేష్‌బాబు, అబ్రహం లింకన్, చిరంజీవి, రాజేష్, రామ్‌మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 21: వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిచారు. స్థానిక నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో శనివారం ఎస్‌వీ యోగా సభ్యుడు వంగర మాధవరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి భార్య జగదీశ్వరి, కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి ఆహారాన్ని అందించారు. అనంతరం బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ సేవాశాంతి ఆశ్రమంలోని వృద్ధులకు ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీ యెగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, కుర్రా శ్రీను, కె శ్రీనివాసరావు, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, కోటేశ్వరరావు, సత్యనారాయణ, సునీత, మురళి, భారతి, అనూష తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- పురపాలక సంఘు చైర్‌పర్సన్ రాధిక



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ లక్ష్మీలావణ్య తదితరులు

తెనాలి (మారీసుపేట), సెప్టెంబరు 21: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పట్టణ పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. స్థానిక మారీసుపేట చంద్రబాబునాయుడు కాలనీ 24వ వార్డులో శనివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక ప్రారంభించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వచ్ఛతా హీ సేవ 2024 కార్యక్రమాలలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పట్టణంలో నిర్వహిస్తున్నమని తెలిపారు. 24వ వార్డులోని మురుగు కాలువలలోని వ్యర్థాలను, సిల్ట్‌ను, పిచ్చిచెట్లను తొలగించామన్నారు. ప్రజలు తమ ఇంటిముందున్న మురుగు కాలువలలో వ్యర్థాలను, ప్లాస్టిక్ కవర్లను వేయరాదని అన్నారు. వాటివలన సిల్ట్ పొరుకొనిపోయి మురుగునీరు పారుదల ఆగిపోతుందని అన్నారు. సీజనల్ వ్యాధుల భారిన ప్రజలు పడే ప్రమాదముందన్నారు. డ్రెయిన్‌లపై ఉన్న ఆక్రమలను తొలగించాలని కోరారు. ప్రతి ఒక్కరి సహకారంతోనే స్వచ్ఛ తెనాలి, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధ్యమని అన్నారు. అనంతరం 10, 40వ వార్డులలో జరుగుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను పర్యవేక్షించి శానిటేషన్ అధికారులకు, సిబ్బంది పలు సూచనలు చేశారు. విద్యార్థులకు శానిటేషన్‌పై అవగాహన సదస్సును నిర్వహించి, విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ బి.శేషన్న, అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, ఎంఈ శ్రీనివాసరావు, కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ డి శ్రీనివాసరావు, శానిటేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

- దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సాంబిరెడ్డి

కొల్లిపర, సెప్టెంబరు 21 : పేద ప్రజలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజులు పరిపాలనలో భాగంగా అధికారులు, నాయకులు మండలంలోని గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' అని ప్రజలకు చేసిన కార్యక్రమాల కరపత్రాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వల్లభాపురంలో జరిగిన సమావేశంలో సాంబిరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలు నేరవేర్చేలా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు, ఎఎస్‌వో మనోహర్‌రెడ్డి, ఏపీఎం ప్రియదర్శిని, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వల్లభాపురంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

సంగంజాగర్లమూడిలో...

తెనాలి రూరల్, సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తలపెట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' ఇంటింటి ప్రచారం కూటమి శ్రేణులు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని సంగంజాగర్లమూడిలో శనివారం గ్రామ సర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి, ఎంపీటీసీ పసుపులేటి వెంకటనరసమ్మ, కొత్త రమేష్‌బాబు, మాజీ సర్పంచ్ మాతంగి భాస్కరరావు, కొండేటి శ్రీనివాసరావు, గోపి, భరత్ తదితరులు కలిసి ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ఇచ్చిన ప్రాధాన్యతను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. మండలంలోని ఎరుకలపూడిలో ఆ గ్రామ సర్పంచ్ పసుపులేటి సామ్రాజ్యం, తెనాలి నియోజవర్గ జనసేన పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పసుపులేటి మురళికృష్ణ, కూటమి నాయకులు అన్నదాసు నాగేశ్వరరావు, ఆలపాటి దుర్గారావు, ముళ్లపూడి వెంకటశ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ బొంతవెంకటస్వామి ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న తీరును ప్రజలకు వివరించి కరపత్రాలు అందించారు. ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సంగంజాగర్లమూడిలో ఇంటింటి ప్రచారంలో సర్పంచ్, ఎంపీటీసీ కూటమి నాయకులు

ప్రజలు ఆకాంక్షలు నేరవేర్చే విధంగా కూటమి పాలన

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 21 : ప్రజల ఆకాంక్షలు నేరవేర్చే విధంగా కూటమి పాలన ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు అన్నారు. శనివారం మండల పరిధిలోని పలు గ్రామాలతో పాటు పొన్నూరులోని పలు వార్డులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పర్యటించిన నాయకులు వంద రోజులలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, ప్రభుత్వ విధానాల గురించి ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. అలాగే ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పథకాల అమలు గురించి చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బ్రాహ్మణకోడూరులో కరపత్రాలు పంచిపెడుతున్న టీడీపీ నాయకులు

తాగునీటి పైపులైన్ లీకులకు మరమ్మతులు



పైపులైన్‌కు మరమతులు చేసిన అధికారులు

తెనాలి (మారీసుపేట) సెప్టెంబరు 21 : స్థానిక రామలింగేశ్వరపేటలోని పులిపాటి వీధిలో పైపులైను లీకుతో తాగునీరు వృధాగా పోతున్నాయన్న కథనంతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించి శనివారం పైపులైన్‌కు మరమ్మతులు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి వార్డు ప్రజలు తమ కృతజ్ఞతలను తెలిపారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎంపీడీవో

కొల్లిపర, సెప్టెంబరు 21 : మనం ఆరోగ్యంగా ఉండాలంటే గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రం కొల్లిపరలో శనివారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అదేవిధంగా మండలంలోని గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించి పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రజలకు పారిశుధ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు, మండల కో-ఆర్డినేటర్ మర్రెడ్డి వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపరలో పంచాయతీ కార్మికులకు మందులను పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

హైజంప్‌లో అభిలాష్‌కు రజత పతకం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 21 : తెలంగాణ రాష్ట్రం నల్గొండలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో నాజరుపేట సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. హైజంప్‌లో పి.అభిలాష్ అనే విద్యార్థి రజత పతకం సాధించాడు. లాంగ్‌జంప్‌లో ఎస్.మంజునాథ్ అనే విద్యార్థి నాలుగో స్థానంలో నిలిచాడు. జావెలిన్ త్రోలో లిపిక మహాలక్ష్మి, డిస్కస్ త్రోలో నిహారిక, లక్ష్మిచాందన నాలుగో స్థానంలో నిలిచారు. జాతీయ స్థాయి పోటీలకు అభిలాష్ ఎంపికయ్యాడు. ప్రతిభ చూపిన విద్యార్థులను శనివారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ సూరజ్‌మోహన్, డైరెక్టర్ అరుణలత, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజా దర్బార్‌తో ప్రజా సమస్యల పరిష్కారం

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 21 : నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌తో ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ జోసఫ్ మోసిగంటి శనివారం అన్నారు. ప్రజాదర్బార్‌కు అందుతున్న అర్జీలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయటమే కాకుండా ఆ అర్జీదారుడి వివరాలు నమోదు చేసుకుని వాటి పరిష్కారానికి లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్ హయాంలో ఫొటోలకు ఫోజులు ఇచ్చి తర్వాత ప్రజల అర్జీలను చెత్త బుట్టలో వేసేవారని ఆరోపించారు. వరదల సమయంలో ప్రజల చెంతనే ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకుని సహాయం చేసారని అభినందించారు. విజయవాడ వరదల ప్రాంతంలో అనేక చర్చిలు కూడా దెబ్బతిన్నాయని వాటికి కూడా పరిహారం ఇచ్చేలా లోకేష్ చొరవచూపాలని డాక్టర్ జోసఫ్ కోరారు.

శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 21 : శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయని తహసీల్దార్ కెవి గోపాలకృష్ణ చెప్పారు. ఐతానగర్ ఎస్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో శనివారం సెకండరీ పాఠశాల విద్యార్థుల క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, తద్వారా ఉన్నత విద్య, ఉద్యోగాలలో అవకాశాలు మెరుగుపరుచుకోవాలని చెప్పారు. మున్సిపల్ మాజీ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమా, ఈదర వెంకటపూర్ణచంద్, రవి, కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, బెల్లంకొండ వెంకట్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. క్రీడల నిర్వహణకు జ్యోతుల బాబీ రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు.



ఆటల పోటీలు ప్రారంభిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

ఘనంగా గురజాడ జయంతి వేడుకలు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 21: పట్టణ పరిసర గ్రామాలలో, పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం గురజాడ అప్పారావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్న పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి అన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారుల, సిబ్బంది పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్, సెప్టెంబరు 21 : నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయంలో మహాకవి గురజాడ అప్పారావు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లైబ్రేరియన్ రమాదేవి మాట్లాడుతూ, సమాజంలో మూఢనమ్మకాలను, దురాచారాలను ఆయన తన రచనల ద్వారా నిర్మూలించేందుకు కృషి చేశారని చెప్పారు. ప్రజలందరికి అర్థమయ్యే రీతిలో రచనలు చేశారని అన్నారు.

వరద బాధితులకు రూ.పది వేల విరాళం

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 21 : పట్టణంలోని పీబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు వరద బాధితులకు రూ.10,116 విరాళం అందచేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ శివకుమారి శనివారం తెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థులు వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించి ముఖ్యమంత్రి సహాయ నిధికి అందచేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డి.మల్లీశ్వరరావు, జె.రుయదాస్ పాల్గొన్నారు.

23న ఫొటోగ్రాఫర్ల వర్క్ షాప్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 21 : పట్టణంలోని పల్సస్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో కెనాన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ వర్క్ షాప్ ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ జిలాని శనివారం తెలిపారు.



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులతో ప్రిన్సిపాల్ వెంకటరమణ, ప్రొఫెసర్ డి.నాగిరెడ్డి

వైద్యరంగంలో ఫార్మసిస్ట్‌ల పాత్ర కీలకం

- ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె వెంకటరమణ

తెనాలి రూరల్, సెప్టెంబరు 21: వైద్యరంగంలో ఫార్మసిస్ట్‌ల పాత్ర కీలకమని తెనాలి బుర్రిపాలెం రోడ్డు ఏఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. ఏఎస్ఎన్ కళాశాల జాతీయ ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని చినరావూరులో డాక్టర్ పాల్‌రాజ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులకు మెడిసిన్ తయారీ, వాటిని వినియోగించే విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ వైద్యులు వ్యాధిని కనుగొనితే ఫార్మసిస్ట్‌లు వాటిని నయం చేసే మందులకు అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతారన్నారు. మెడిసిన్ సరిగా పనిచేయకపోవడం, ఇతర దుష్ప్రభావాలు రోగికి తలెత్తడం వంటివాటిపై ఫిర్యాదు చేసేందుకు అందుబాటులో ఉండే కేంద్రాల వివరాలను ప్రొఫెసర్ డాక్టర్ డి.నాగిరెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించి కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఐపీఎస్ఎఫ్ మెంటార్స్ జి.నందగోపాలకృష్ణ, పి.భార్గవి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, ఎ.సోనిప్రియాంక, డాక్టర్ టి.లక్ష్మిదుర్గ, నర్సింగ్ కాలేజీ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి పి.రాధిక, అధ్యాపక బృందం, ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట నష్టం నమోదు ప్రక్రియను పొడిగించాలి

- ఏపీ రైతు సంఘం నాయకులు

తెనాలి రూరల్, సెప్టెంబరు 21: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటల వివరాల నమోదు ప్రక్రియను మరో మూడు రోజులు పొడిగించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం ప్రతినిధుల బృందం శనివారం మండలంలోని హాఫ్‌పేట, ఖాజీపేట, నందివెలుగు గ్రామాల్లో పర్యటించి పంటల నష్టం వివరాలను రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా వేలాది ఎకరాల్లో పంట నీటిపాలైందని రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం హడావిడిగా పంటనమోదు ప్రక్రియను ప్రారంభించి ముగింపు పలుకుతోందని దీంతో రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందే పరిస్థితి లేకుండాపోతుందని ఆరోపించారు. ఆయా ప్రాంతాల్లో అధిక సంఖ్యలో కౌలు రైతులే సాగుచేస్తున్నారని వారి వద్ద భూముల పాస్‌బుక్, మీ భూమి ఆన్‌లైన్ వన్‌బీ, అడంగల్ వంటివి అందుబాటులో లేవన్నారు. భూయజమానిని సంప్రదించి వారి వద్ద వాటి జిరాక్స్ తీసుకుని వ్యవసాయ శాఖ అధికారులకు అందించేందుకు సమయం సరిపోవడం లేదని, మరో మూడు రోజులు నమోదు ప్రక్రియను పొడిగించాలన్నారు. ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. వరిపంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.20వేలు నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నందివెలుగు, హాఫ్‌పేట గ్రామాల్లోని సచివాలయాల్లో వినతిపత్రాలు అందించారు. తులాబందుల వెంకట కృష్ణారావు, గంపెన ప్రమీలారాణి, శ్రీనివాసరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.



నందివెలుగులో సర్పంచ్ పవన్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న శివశంకరరావు, శివసాంబిరెడ్డి తదితరులు

పౌష్టికాహారంతో వ్యాధి నిరోధక శక్తి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 21 : పౌష్టికాహారం స్వీకరించటం ద్వారా వ్యాధిరోధిక శక్తిని పెంపొందించుకోవచ్చని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ శేషమ్మ అన్నారు. మన్నవ సెక్టార్ పరిధిలో దొప్పలపూడి గ్రామంలో శనివారం పోషకాహార మాసోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



పోషకాహార మాసోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

జీఎల్ రాయ్‌కి ఘన నివాళి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 21 : ప్రముఖ అంబేద్కర్ వాది, రచయిత, న్యాయవాది సామాజిక ఉద్యమ కారుడు గోళ్లమూడి లజపతి రాయ్ మృతి తీరని లోటు అని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ టి రాజారావు అన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ షాదీ ఖానాలో శనివారం జీఎల్‌రాయ్ సంతాప సభ జరిగింది. రాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు దళిత సంఘాల నాయకులు, పౌరహక్కుల సంఘాల నాయకులు పాల్గొన్ని రాయ్ సేవలను కొనియాడారు. ఈ సభలో మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్ జీఎస్ రాయ్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, చేబ్రోలు రత్నరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎన్.రూత్‌రాణి, తోడేటి శ్రీనివాస్, బొలగాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

కాల్వలో పడి మతిస్థిమితం లేని మహిళ మృతి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 21 : పట్టణంలో తుంగభద్ర డ్రెయిన్‌లో పడి మతిస్థిమితం లేని మహిళ మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం 7వ వార్డు డీవీసీ కాలనీకి చెందిన మేకల సమాధానం (39) అనే మహిళ మతిస్థిమితం లేకుండా సంచరిస్తుంది. సమాధానం శనివారం తుంగభద్ర డ్రెయిన్‌లో పడి మృతి చెందింది. మృతురాలి భర్త అంకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డ్రెయిన్‌లో మృతదేహాన్ని వెలికితీసి శవ పరీక్షల నిమిత్తం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.